# జనం రిపోర్టర్ తెలుగు దినపత్రిక

సంపుటి : 01 సంచిక : 118 ఎడిటర్ : మార్పు సాయికుమార్ పేజీలు : 8, వెల రూ. 5, మంగళవారం - 06 - ఆగస్టు - 2024

Publisher from Srikakulam: circulated at vijayanagaram Visakhapatnam East Godavari West Godavari Krishna guntur Prakasam Kurnool Nellore Chittoor Kadapa ananthapuram Hyderabad



విలేకరులు కావలెను

జనం రిపోర్టర్ తెలుగు దినపత్రిక

ప్రజా శ్రేయస్సే ధ్యేయంగా నడపబడుతున్న జనం రిపోర్టర్ తెలుగు దినపత్రికలో పనిచేయుటకు ఆంధ్ర మరియు తెలంగాణ రాష్ట్రాల్లో జిల్లాల వారిగా రిపోర్టర్లు కావలెను. అంకిత భావంతో పనిచేసేందుకు ఆసక్తి గలవారు

సంప్రదించండి: 9398 15 6948


## ఉపఎన్నికలు తెలంగాణాలో ఇప్పుడు సాధ్యమా..?



ఉప ఎన్నికలు రాబోతున్నాయంటూ పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ ప్రకటించారు..

ఎమ్మెల్యేలపై అనర్హత వేటు వెయ్యాలంటూ పార్టీ తరపున కోర్టుకు వెళ్తున్నట్లు కేటీఆర్ ప్రకటించారు..

## రాష్ట్రంలో రుణమాఫీ కానీ రైతులకు బీఆర్ఎస్ పార్టీ అండగా నిలిచింది.



హైదరాబాద్ : రాష్ట్రంలో రుణమాఫీ కానీ రైతులకు బీఆర్ఎస్ పార్టీ అండగా నిలిచింది. లక్ష కానీ, లక్షన్నరలోపు కానీ బ్యాంకులో రుణం తీసుకొని ఉండి, మీకు రుణమాఫీ జరగకపోతే ఈ 8374852619 వాట్సప్ నంబర్‌కి మీ వివరాలు పంపాలని

## శ్రీశైలం దేవస్థానంలో శ్రావణమాసోత్సవాలు...

భక్తులతో కిక్కిరిసిన శ్రీగిరులు..



భక్తులు వేకువజాము నుంచే భక్తులు పాతాళగంగలో స్నానాలు చేసి స్వామి, అమ్మవార్ల దర్శనం కోసం బారులు తీరారు.

# బంగ్లాదేశ్‌లో రాజకీయ అస్థిరత

- గత కొన్ని వారాలుగా జరిగిన అల్లర్లలో నష్టపోయిన బాధితులకు, మృతులకు న్యాయం చేస్తామని ఆర్మీ చీఫ్ హామీ ఇచ్చారు.
- దేశవ్యాప్తంగా అల్లర్లు జరగడం, పోలీసుల కాల్పుల్లో వందలాది మంది మరణించడం, పరిస్థితులు అదుపుతప్పడంతో ప్రధాని పదవికి షేక్ హసీనా రాజీనామా చేశారు
- దేశ వ్యాప్తంగా కర్ఫ్యూ లేదా ఎమర్జెన్సీని విధించాల్సిన అవసరం లేదన్నారు.



ఢిల్లీ : బంగ్లాదేశ్‌లో విద్యార్థులు చేపట్టిన నిరసనలు ఏకంగా ఆ దేశ ప్రధాని షేక్ హసీనాను పదవి నుంచి దిగిపోయేలా చేయడంతో పాటు దేశం విడిచి పారిపోయేలా చేశాయి. దేశవ్యాప్తంగా అల్లర్లు జరగడం, పోలీసుల కాల్పుల్లో వందలాది మంది మరణించడం, పరిస్థితులు అదుపుతప్పడంతో ప్రధాని పదవికి షేక్ హసీనా రాజీనామా చేశారు. ఆ తరువాత ఆమె సోమవారం సాయంత్రం ఢిల్లీ చేరుకున్నారు. ఈ నేపథ్యంలో షేక్ హసీనా బంగ్లాదేశ్ నుంచి వెళ్లిపోవడంతో అక్కడ రాజకీయంగా ఏం జరుగుతోంది? ఆర్మీ చీఫ్ ఏం చెప్పారు? అసలు షేక్ హసీనా భారత్‌కే ఎందుకొచ్చారు? దేశంలో శాంతిభద్రతలను ఆర్మీ పర్యవేక్షిస్తుందని వాకర్-ఉజ్-జమాన్ అన్నారు.

### దేశాన్ని ఆర్మీ ఆధీనంలోకి తీసుకుందా?

ప్రధాని పదవికి షేక్ హసీనా రాజీనామా చేయడంతో 'దేశంలో మధ్యంతర ప్రభుత్వం ఏర్పాటు కానుంది' అని బంగ్లాదేశ్ ఆర్మీ చీఫ్ వాకర్-ఉజ్-జమాన్ ప్రకటించారు. అయితే దేశ వ్యాప్తంగా కర్ఫ్యూ లేదా ఎమర్జెన్సీని విధించాల్సిన అవసరం లేదన్నారు. ఆర్మీ చీఫ్ సోమవారం బంగ్లాదేశ్ ప్రజలనుద్దేశించి మాట్లాడారు. దేశ అధ్యక్షుడు మహ్మద్ షహబుద్దీన్‌ను కలవబోతున్నానని, పరిష్కారం దొరుకుతుందని ఆశిస్తున్నానని వాకర్-ఉజ్-జమాన్ చెప్పారు. ప్రస్తుత పరిస్థితిపై దేశంలోని ప్రతిపక్ష రాజకీయ పార్టీలతో ఇప్పటికే మాట్లాడినట్లు ఆయన తెలిపారు. నిరసనకారులు ఆందోళనలు విరమించాలని, ఇళ్లకు వెళ్లిపోవాలని ఆయన కోరారు. దేశంలో శాంతిభద్రతలను ఆర్మీ పర్యవేక్షిస్తుందని వాకర్-ఉజ్-జమాన్ అన్నారు. "అందరూ మద్దతుగా నిలవాలి, మీతో యుద్ధం చేసి మేమేం గెలవలేం, ఆందోళనలు ఆపండి. అందరం కలిసి అందమైన దేశాన్ని నిర్మించుకుందాం" అని ఆర్మీ చీఫ్ అన్నారు. గత కొన్ని వారాలుగా జరిగిన అల్లర్లలో నష్టపోయిన బాధితులకు, మృతులకు న్యాయం చేస్తామని ఆర్మీ చీఫ్ హామీ ఇచ్చారు. ఘటనలపై పూర్తి విచారణ జరుపుతామని చెప్పారు. అయితే, ప్రభుత్వాన్ని ఎవరు నడిపిస్తారనే దానిపై ఆర్మీ చీఫ్ స్పష్టత

# అధికారులకు స్వీట్ వార్నింగ్..

# తేడా వస్తే అంతే సంగతులు....

- ప్రభుత్వ ప్రాధాన్యతలు ఏమిటో సీఎం అధికారులకు ఫుల్ క్లారిటీ ఇచ్చారు.
- కూటమి ప్రభుత్వం అధికారం చేపట్టిన తర్వాత సీఎం చంద్రబాబు తొలిసారి కలెకర్ల సదస్సు నిర్వహించారు.
- ఎవరైనా తప్పులు చేస్తే మాత్రం ఉపేక్షించేది లేదని తేల్చి చెప్పారు.
- విధి నిర్వహణలో అలసత్వం ప్రదర్శిస్తే మాత్రం చర్యలు తప్పవని హెచ్చరించారు.




వివరాలు 2లో..




ఆంధ్రప్రదేశ్‌లో తెలుగుదేశం కూటమి ప్రభుత్వం అధికారం చేపట్టిన తర్వాత సీఎం చంద్రబాబు తొలిసారి కలెకర్ల సదస్సు నిర్వహించారు. రానున్న ఐదేళ్ల ప్రభుత్వ పాలన ఎలా ఉండాలి.. ప్రభుత్వ ప్రాధాన్యతలు ఏమిటో సీఎం అధికారులకు ఫుల్ క్లారిటీ ఇచ్చారు. గతాన్ని ఎక్కువగా తవ్వకుండానే.. తప్పిదాలను మర్చిపోయి ప్రజల ఆకాంక్షలకు అనుగుణంగా ఎలా ముందుకెళ్లాల్లో స్పష్టం చేశారు. బాగా పనిచేసే అధికారులకు ప్రభుత్వం ఎక్కువ ప్రాధాన్యత ఇస్తోందని, ఎవరైనా తప్పులు చేస్తే మాత్రం ఉపేక్షించేది లేదని తేల్చి చెప్పారు. 2019లో వైసీపీ అధికారంలోకి వచ్చిన తర్వాత అప్పటి సీఎం జగన్ తొలి కలెక్టర్ల సదస్సును ప్రజావేదికలో నిర్వహించి.. సాయంత్రానికి ఆ భవనాన్ని కూల్చేయాలని ఆదేశించడం ద్వారా విధ్వంసంతో తన పరిపాలనను ప్రారంభించారని.. అలాంటి పొరపాట్లు ఈ ప్రభుత్వంలో

## కేసీఆర్‌కు భూపాలపల్లి కోర్టు నోటీసులు జారీ

- మేడిగడ్డ బ్యారేజీ వైఫల్యంపై రాజలింగంమూర్తి అనే సామాజిక కార్యకర్త ఈ పిటిషన్ దాఖలు చేశారు.
- ఇటీవలే బీఆర్ఎస్ ఎమ్మెల్యేలు కూడా ప్రాజెక్టును సందర్శించారు.



భూపాలపల్లి: మాజీ సీఎం, బీఆర్ఎస్ అధినేత కే.చంద్రశేఖర్ రావుకి బిగ్ షాక్ తగిలింది. డిజైన్ల మార్పు, నాణ్యత లోపాలే

## ఆవాస్ యోజన'లో జగన్ ప్రభుత్వం ఘోర వైఫల్యం

జగన్ ప్రభుత్వ వైఫల్యాన్ని కేంద్ర ప్రభుత్వ గణాంకాలు స్పష్టం చేశాయి.

దేశంలోనే అత్యధికంగా ఆంధ్రప్రదేశ్‌కు ప్రధానమంత్రి నరేంద్రమోదీ ఆవాస్ యోజన అర్బన్ పథకం కింద ఇళ్లు కేటాయించినట్లు చెప్పింది.



అమరావతి: ప్రధానమంత్రి ఆవాస్ యోజన అర్బన్ పథకం అమల్లో జగన్ ప్రభుత్వ ఘోర వైఫల్యం చెందింది. జగన్ ప్రభుత్వ వైఫల్యాన్ని కేంద్ర ప్రభుత్వ గణాంకాలు స్పష్టం చేశాయి. ఈ పథకం కింద దేశవ్యాప్తంగా ఆంధ్రప్రదేశ్ సహా రాష్ట్రాలు ,కేంద్ర పాలిత ప్రాంతాల్లోని పట్టణ ప్రాంతాల్లో పెద్ద ఎత్తున ఇళ్ల నిర్మాణానికి కేంద్రం శ్రీకారం చుట్టింది. దేశంలోనే అత్యధికంగా ఆంధ్రప్రదేశ్‌కు ప్రధానమంత్రి నరేంద్రమోదీ ఆవాస్ యోజన అర్బన్ పథకం కింద ఇళ్లు కేటాయించినట్లు చెప్పింది. ఏపీకి కేటాయించిన ఇళ్లలో అసంపూర్తిగా సుమారు పది లక్షలకు పైగా ఇళ్ల నిర్మాణాలు ఉన్నాయని స్పష్టం చేసింది. ఏపీకి ఇప్పటివరకు 21,37,028 ఇళ్లు కేటాయించగా కేవలం 9,79,620 ఇళ్ల నిర్మాణం మాత్రమే పూర్తి చేసినట్లు తెలిపింది. ఇళ్ల నిర్మాణానికి ఏపీకి రూ.32,568 కోట్లు కేటాయించగా రూ.23,800 కోట్లు విడుదల చేసినట్లు పేర్కొంది. ఏపీకి భిన్నంగా గుజరాత్, తెలంగాణ, ఉత్తర ప్రదేశ్, తమిళనాడు, పశ్చిమ బెంగాల్, కర్ణాటక, సహా చాలా రాష్ట్రాల్లో కేటాయించిన ఇళ్ల నిర్మాణాలు దాదాపు పూర్తి అయినట్లు తెలిపింది. తెలంగాణకు ఇప్పటివరకు 2,50,084 ఇళ్లు కేటాయించగా 2,24,679 ఇళ్ల నిర్మాణాలు పూర్తి అయ్యాయని చెప్పింది. రాజ్యసభలో బీజేపీ ఎంపీ కే. లక్ష్మణ్ సహా పలువురు ఎంపీలు అడిగిన ప్రశ్నకు కేంద్ర పట్టణాభివృద్ధి మంత్రిత్వ శాఖ వివరాలు వెల్లడించింది.

## నో బెయిల్ మళ్లీ జైలుకే..



బీఆర్ఎస్ఎమ్మెల్సీ కల్వకుంట్ల కవిత తీహార్ జైలు నుంచి బయటకొచ్చేందుకు చేసిన మరో ప్రయత్నం కూడా విఫలమైంది. ఢిల్లీ లిక్కర్ స్కాం కేసులో నిందితురాలిగా చూపిస్తూ సీబీఐ కవితను కస్టడీకి తీసుకుంది.సుమారు నాలుగు నెలలకుపైగా జైలులో ఉంటోంది. ఈకేసులో కవిత తరపు లాయర్లు డీఫాల్ట్ బెయిల్ పిటిషన్ దాఖలు చేసినప్పటికి తుది విచారణను ఆగస్ట్ 7వ తేదికి వాయిదా వేసింది ట్రయిల్ కోర్టు. సీనియర్ అడ్వకేట్ అందుబాటులో లేనందున కేసును మరో రోజు వాయిదా వేయాలని కవిత తరపు లాయర్ కోరడంతో జడ్జీ విచారణను రెండ్రోజులకు వాయిదా వేశారు. ఢిల్లీ లిక్కర్ స్కాం కేసులో నిందితురాలిగా ఉన్న బీఆర్ఎస్ ఎమ్మెల్సీ కల్వకుంట్ల కవితకు బెయిల్ మంజూరు చేయాలని వేసిన పిటిషన్ పై విచారణ మరోసారి వాయిదా పడింది.ప్రస్తుతం తీహార్ జైలులో ఉన్న కవిత తనకు డీఫాల్ట్ బెయిల్ మంజూరు చేయాలని కోర్టును ఆశ్రయించింది. దీనిపై సోమవారం విచారణ జరిపిన కోర్టు ఆగస్టు 7న తుది వాదనలు వింటామని తెలిపింది.సీనియర్ అడ్వకేట్ అందుబాటులో లేకపోవడంతో కేసును మరో రోజుకు వాయిదా వేయాలని కోరిన కవిత తరపు లాయర్ కోర్టును కోరారు. ఈ క్రమంలో తదుపరి విచారణను జడ్జ్ కావేరి భవేజా వాయిదా వేశారు.

### రెండ్రోజుల తర్వాత తుది విచారణ..

లిక్కర్ స్కాం కేసులో కల్వకుంట్ల కవితను మొదటగా మార్చి 15న తొలుత ఈడీ అరెస్ట్ చేసింది. ఆ తర్వాత ఏప్రిల్- 11న సీబీఐ అరెస్టు చేసి తీహార్ జైలుకు తరలించింది.అప్పటి నుంచి తనకు బెయిల్ మంజూరు చేయాలని ఢిల్లీ హైకోర్టు, అవెన్యూ కోర్టు, చివరకు సుప్రీం కోర్టును కూడా ఆశ్రయించినప్పటికి బెయిల్ మంజూరు కాలేదు. చివరకు డీఫాల్ట్ బెయిల్ కోసం వేసిన పిటిషన్ పై మరో రెండ్రోజులు వాయిదా వేసింది.

### కవితను కలవనున్న కేటీఆర్, హరీష్..

తిహార్ జైలులో ఉన్న కవితను తెలంగాణ మాజీ మంత్రులు కేటీఆర్, హరీశ్ రావు ఇవాళ కలిసినట్లు బీఆర్ఎస్ వర్గాలు చెబుతున్నాయి.

## పాతనగరం మెట్రోకే రూ.2300 కోట్ల అంచనా..

- మెట్రో 2.0 కోసం కారిడార్ల వారీగా డీపీఆర్‌లు
- 'ఎయిర్‌పోర్టు' కారిడార్‌కు రూ.8500 కోట్లు
- 'పాతబస్తీ'కి రూ.2300 కోట్ల అంచనా
- 2029 నాటికి పూర్తి చేసేలా డీపీఆర్‌ల రూపకల్పన
- ఆగస్టు 15 నాటికి ప్రభుత్వం ముందుకు



సిటీబ్యూరో: మెట్రో రైలు రెండో దశ సమగ్ర ప్రాజెక్టు నివేదికల రూపకల్పన కొలిక్కి వచ్చింది. మొదటి దశను అనుసంధానం చేస్తూ రూ.24,042 కోట్ల అంచనాతో 78.4 కి.మీ మేర విస్తరించేలా 5 కారిడార్లను నిర్మించాలని ప్రతిపాదించారు. ఇందుకు అనుగుణంగా ప్రైవేట్ కన్సల్టెన్సీ సంస్థ సిస్ట్రాకు డీపీఆర్ రూపకల్పన బాధ్యతలను ఇవ్వడంతో ఆ సంస్థ ప్రతినిధులు బేగంపేటలోని మెట్రో రైలు భవన్ కేంద్రంగానే పనిచేస్తున్నారు. డీపీఆర్‌కు తుది రూపం ఇస్తున్నారు. సీఎం రేవంత్ రెడ్డి విదేశీ పర్యటన ముగించుకొని వచ్చే నాటికి డీపీఆర్‌ను ప్రభుత్వం ముందుంచాలని హైదరాబాద్ మెట్రో అధికారులు లక్ష్యంగా పెట్టుకున్నారు. రెండో దశలో ప్రతిపాదించిన 5మెట్రో కారిడార్లకు వేర్వేరుగా డీపీఆర్‌లను సిద్ధం చేశారు. మొదటి దశలో పెండింగ్‌లో

## ఎమ్మెల్సీ ఎన్నికల్లో విజయం వైఎస్సార్సీపీదే: వైవీ సుబ్బారెడ్డి



రాజకీయ నాయకులను, ప్రజలను ప్రలోభాలకు గురి చేయడం కూటమి నేతలకు అలవాటేనని అన్నారు

విశాఖ స్థానిక సంస్థల ఎమ్మెల్సీ ఎన్నికల్లో వైఎస్సార్సీపీ విజయం సాధిస్తుందని చెప్పుకొచ్చారు.

విశాఖపట్నం: రాజకీయ నాయకులను, ప్రజలను ప్రలోభాలకు గురి చేయడం కూటమి నేతలకు అలవాటేనని అన్నారు వైఎస్సార్సీ ఎంపీ వైవీ సుబ్బారెడ్డి. అలాగే, విశాఖ స్థానిక సంస్థల ఎమ్మెల్సీ ఎన్నికల్లో వైఎస్సార్సీపీ

## రేషన్ బియ్యం డోర్ డెలివరీ పేరుతో అక్రమాలు



- వైసీపీ నేత ద్వారంపూడి కుటుంబం రేషన్ బియ్యం అక్రమాలపై కలెక్టర్ల కాన్ఫరెన్సులో సీఎం చంద్రబాబు ప్రస్తావించారు.
- ఒకే కుటుంబంలోని ముగ్గురు పదవులు తెచ్చుకుని.. రేషన్ బియ్యం మాఫియాకు పాల్పడ్డారని ఆరోపించారు.
- సోమవారం నాడు ఏపీ సచివాలయంలో కలెక్టర్ల సదస్సు నిర్వహించారు.
- ప్రతి జిల్లా కలెక్టర్ ద్రవ్యోల్బణం విషయంలో జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు.

అమరావతి: వైసీపీ ప్రభుత్వంలో రేషన్ బియ్యం డోర్ డెలివరీ పేరుతో అక్రమాలకు పాల్పడ్డారని ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు ఆరోపించారు. వైసీపీ నేత ద్వారంపూడి కుటుంబం రేషన్ బియ్యం అక్రమాలపై కలెక్టర్ల కాన్ఫరెన్సులో సీఎం చంద్రబాబు ప్రస్తావించారు. రూ.1800 కోట్లు ప్రభుత్వంతో ఖర్చు పెట్టించి మరీ అవినీతికి పాల్పడ్డారని విమర్శించారు. రేషన్ బియ్యం డోర్ డెలివరీ వాహనాల్లోనే బియ్యం రీ-సైక్లింగ్ చేశారని చెప్పారు. ఒకే కుటుంబంలోని ముగ్గురు పదవులు తెచ్చుకుని.. రేషన్ బియ్యం మాఫియాకు పాల్పడ్డారని ఆరోపించారు. అన్ని వర్గాలకు సమన్యాయం చేయాల్సి ఉంటుందని చెప్పారు. సోమవారం నాడు ఏపీ సచివాలయంలో కలెక్టర్ల సదస్సు నిర్వహించారు. ఈ సమావేశంలో సీఎం చంద్రబాబు పలు కీలక విషయాలపై

## ఉపఎన్నికలు తెలంగాణాలో ఇప్పుడు సాధ్యమా..?

(మొదటి పేజి తరువాయి..)

హైదరాబాద్ : తెలంగాణాలో ఇటీవలే కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వచ్చింది.. బీఆర్ ఎస్ ప్రతిపక్షానికి పరిమితమైంది.. ఈ క్రమంలో అక్కడ ఉప ఎన్నికలు రాబోతున్నాయంటూ పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ ప్రకటించారు.. దీనిపై ప్రస్తుతం అన్ని రాజకీయ పార్టీల్లో చర్చ నడుస్తోంది.. అసలు ఉపఎన్నికలు తెలంగాణాలో ఇప్పుడు సాధ్యమా..? కేటీఆర్ మాటల వెనుక ఉన్న ఆంతర్యమేంటో చూద్దాం.. తెలంగాణాలో కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి రాగానే.. కారు పార్టీ ఎమ్మెల్యేలు సుమారు 10 మంది హస్తం గూటికి చేరారు.. దీంతో అసెంబ్లీలో బీఆర్ఎస్ బలం తగ్గిపోయింది.. ఈ క్రమంలో వారిమీద అనర్హత వేటు వేయించేందుకు ఆ పార్టీ నాయకత్వం సిద్ధమైంది.. ఈ విషయంపై రాజ్యాంగ నిపుణులతో బీఆర్ఎస్ పార్టీ సీనియర్ ప్రతినిధుల బృందం సమావేశం అయిందట. మరో నెల రోజుల్లో దీనిపై స్పష్టత వచ్చే అవకాశముందని బీఆర్ఎస్ నేతలు చెబుతున్నారు.. ఎమ్మెల్యేలపై అనర్హత వేటు వెయ్యాలంటూ పార్టీ తరపున కోర్టుకు వెళ్తున్నట్లు కేటీఆర్ ప్రకటించారు.. ఈ ప్రకటన ప్రస్తుతం తెలంగాణా రాజకీయాల్లో హాట్ టాపిక్ గా మారింది.. పార్టీ మారిన ఎమ్మెల్యేల అనర్హత విషయంలో న్యాయపరమైన చర్యలు తీసుకునేందుకు బీఆర్ఎస్ ప్రయత్నాలు ముమ్మరం చేసింది. పార్టీకి ద్రోహం చేసిన వారిని ప్రజాక్షేత్రంలోనే ఎదుర్కొంటామని ఆ పార్టీ నేతలు అంటున్నారు.. సుప్రీం కోర్టు నుంచి తీర్పు వస్తే నెలరోజుల్లోనే ఉప ఎన్నికలు వచ్చే అవకాశాలున్నాయని చెబుతున్నారు.. ఒకవేళ ఉప ఎన్నికలు వస్తే కాంగ్రెస్బ పార్టీ దూకుడుకు బీఆర్ ఎస్ తట్టుకోగలదా అన్న సందేహాన్ని రాజకీయ విశ్లేషకులు వ్యక్తపరుస్తున్నారు.ఎడిటర్ : మార్పు సాయికుమార్

## రాష్ట్రంలో రుణమాఫీ కానీ రైతులకు బీఆర్ఎస్ పార్టీ అండగా నిలిచింది.

(మొదటి పేజి తరువాయి..)

మాజీ వ్యవసాయ శాఖ మంత్రి నిరంజన్ రెడ్డి సూచించారు. మా తెలంగాణ భవన్‌లో ఇద్దరు అధికారులను ఈ సమస్య మీదనే నియమించాం అని ఆయన తెలిపారు. తెలంగాణ రైతాంగానికి విజ్ఞప్తి చేస్తున్నాం. మీ పేర పట్టాదార్ పాస్ బుక్ కలిగి ఉండి, అదే పాస్ బుక్ మీద రుణం పొంది ఉండి, లక్ష కానీ, లక్షన్నర లోపు కానీ.. మాఫీ కాకపోతే బీఆర్ఎస్ పార్టీ కార్యాలయం తెలంగాణ భవన్‌కు ఆ వివరాలు పంపొచ్చు అని నిరంజన్ రెడ్డి తెలిపారు. ఏ సర్వే నంబర్ మీద రుణం పొందారు.. ఏ గ్రామం, ఏ బ్యాంకు నుంచి రుణం తీసుకున్నారు అనే వివరాలతో ఇతర విషయాలను 8374852619 అనే నంబర్‌కు వాట్సాప్ చేయాలని సూచించారు. వివరాలతో మీ రిమార్క్ కూడా రాయండి. రుణమాఫీ ఎందుకు కాలేదు.. అధికారులు ఏమన్నారు..? వంటి డిటెయిల్స్ రాసి పంపించండి అని నిరంజన్ రెడ్డి కోరారు. ఈ వివరాలన్నింటినీ రాష్ట్ర ప్రభుత్వానికి సమర్పించి మాట్లాడుతాం. చర్చకు పెడుతాం. ప్రభుత్వం ఏం చెబుతదో ఆ వివరాలన్నింటిని సమాజానికి చెబుతాం. ప్రత్యక్షంగా మాటలు అవసరం లేదు.. ఎంత మందికి వచ్చాయి.. ఎంత మందికి రాలేదో తెలుసుకుందాం. రుణమాఫీ కాని వారికి కూడా వచ్చినట్లు చెబుతూ రైతులను, ప్రజలను మోసం చేస్తోంది కాంగ్రెస్ ప్రభుత్వం. రేవంత్ సర్కార్ దుర్మార్గాన్ని ఎండగడుదాం. 2 లక్షల లోపు రుణాలను ఆగస్టు 15 నాటికి మాఫీ చేస్తామన్నారు. మరి రూపాయికి బదులు అమెరికా డాలర్లు తీసుకొచ్చి చేస్తారేమో చూద్దాం అని రేవంత్ సర్కార్‌పై నిరంజన్ రెడ్డి సెటైర్లు వేశారు.

## ఎమ్మెల్సీ ఎన్నికల్లో విజయం వైఎస్సార్సీపీదే: వైవీ సుబ్బారెడ్డి

(మొదటి పేజి తరువాయి..)

విజయం సాధిస్తుందని చెప్పుకొచ్చారు. కాగా, ఎంపీ వైవీ సుబ్బారెడ్డి సోమవారం మీడియాతో మాట్లాడుతూ... ఉమ్మడి విశాఖ జిల్లా స్థానిక సంస్థల ప్రజా ప్రతినిధులంతా వైఎస్సార్సీపీ అభ్యర్థి బొత్స సత్యనారాయణ విజయానికి కృషి చేయాలి. ఈ ఎన్నికల్లో వైఎస్సార్సీపీకే సంఖ్యా బలం ఉంది. ప్రలోభాలకు గురి చేయడం కూటమి నేతలకు అలవాటే. ఎమ్మెల్యే కోటా ఎమ్మెల్సీ ఎన్నికల్లో కూడా ప్రలోభాలకు గురిచేశారు. మా ప్రజా ప్రతినిధులపై మాకు నమ్మకం ఉంది. ఖచ్చితంగా అందరూ వైఎస్సార్సీపీకే అండగా ఉంటారు అని చెప్పారు.అంతకుముందు, అనకాపల్లిలోని చోడవరం మాడుగుల స్థానిక సంస్థల ప్రజా ప్రతినిధులతో మాజీ మంత్రి బొత్స సత్యనారాయణ, బూడి ముత్యాల నాయుడు, కన్నబాబు, కరణం ధర్మశ్రీ సమావేశమయ్యారు. ఈ సమావేశానికి పెద్ద సంఖ్యలో ఎంపీటీసీలు, జడ్పీటీసీలు హాజరయ్యారు. ఈ సందర్భంగా వైఎస్సార్ సీపీ నేతలు మాట్లాడుతూ.. 'ఉమ్మడి విశాఖ జిల్లా ఎమ్మెల్సీ ఎన్నికలో వైఎస్సార్సీకి సంపూర్ణ బలం ఉంది. 600 మందికిపైగా సభ్యుల బలం వైఎస్సార్సీపీకి ఉంది. కేవలం 200 మంది సభ్యుల బలం మాత్రమే కూటమికి ఉంది. ప్రలోభాలతో గెలవాలని చంద్రబాబు చూస్తున్నారు. చంద్రబాబు మోసం ప్రజలకు తెలియాలి. దేశంలో రాష్ట్రం దివాళా తీసిందని మాట్లాడే వ్యక్తి ఒక్క చంద్రబాబు మాత్రమే. రాజకీయాల్లో 14 ఏళ్లు సీఎంగా పని చేసిన చంద్రబాబుకు రాష్ట్ర ఆర్థిక పరిస్థితి తెలియడా?. వైఎస్సార్సీపీ సభ్యులు తప్పు చేస్తే చర్యలు తీసుకోవచ్చు కదా?. చంద్రబాబు అబద్ధాలను ప్రజలు ఎన్నో రోజులు నమ్మరు అంటూ కామెంట్స్ చేశారు.

## కేసీఆర్‌కు భూపాలపల్లి కోర్టు నోటీసులు జారీ

(మొదటి పేజి తరువాయి..)

మేడిగడ్డ కుంగుబాటుకు కారణమంటూ ఆరోపిస్తూ దాఖలైన ఓ పిటిషన్‌పై విచారణలో కేసీఆర్‌కు భూపాలపల్లి కోర్టు నోటీసులు జారీ చేసింది. సెప్టెంబర్ 5న మాజీ సీఎం కేసీఆర్, మాజీ మంత్రి హరీష్ రావులు వ్యక్తిగతంగా హాజరు కావాలని కోర్టు ఆదేశించింది. మరో ఆరుగురికి కూడా నోటీసులు జారీ చేసింది. కాగా మేడిగడ్డ బ్యారేజీ వైఫల్యంపై రాజలింగంమూర్తి అనే సామాజిక కార్యకర్త ఈ పిటిషన్ దాఖలు చేశారు. డిజైన్లు మార్చడం, నాణ్యత లోపాల కారణంగానే మేడిగడ్డ ప్రాజెక్టు కుంగుబాటుకు గురైందంటూ పిటిషన్‌లో రాజలింగం మూర్తి ఆరోపించారు. కాగా కాళేశ్వరం ఎత్తిపోతల ప్రాజెక్టులో భాగంగా భూపాలపల్లి జిల్లా మహదేవపూర్ మండలంలో మేడిగడ్డ వద్ద నిర్మించిన లక్ష్మీ బ్యారేజీ అంతర్ రాష్ట్ర వంతెన కుంగిన విషయం తెలిసిందే. బ్యారేజీ బీ-బ్లాక్‌లో 19, 20, 21వ పిల్లర్ల మధ్య ఉన్న వంతెన సుమారు 30 మీటర్ల పొడవున.. ఒక ఫీటు వరకు కిందికి కుంగింది. రాత్రివేళ వంతెన కుంగిపోయిన విషయాన్ని మహారాష్ట్ర వెళ్లే ప్రయాణికులు గుర్తించి బయటకు చెప్పడంతో అధికారులు అప్రమత్తమయ్యారు. ఇదంతా బీఆర్ఎస్ ప్రభుత్వ వైఫల్యంతోనే జరిగిందంటూ విపక్షాలు అప్పట్లో మండిపడిన విషయం తెలిసిందే. ఆ తర్వాత ప్రభుత్వం మారడం.. బ్యారేజీని పరిశీలించడం అన్ని జరిగాయి. ఇటీవలే బీఆర్ఎస్ ఎమ్మెల్యేలు కూడా ప్రాజెక్టును సందర్శించారు.

## రేషన్ బియ్యం డోర్ డెలివరీ పేరుతో అక్రమాలు

(మొదటి పేజి తరువాయి..)

కలెక్టర్లను ప్రశ్నించారు. రేషన్ డిపోల్లో గతంలో రకరకాల నిత్యావసరాలు అందించామని తెలిపారు. వివిధ శాఖలపై ఏ విధంగా వ్యవహరించాలనే అంశంపై చంద్రబాబు కీలక సూచనలు ఇచ్చారు. ధరల నియంత్రణ కోసం ప్రత్యేక జేసీని నియమించాలని సీఎం చంద్రబాబు ఆదేశించారు. ధాన్యం సేకరణ విషయంలో చాలా కాలంగా ఉన్న విధానం మంచిదేనని ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు తెలిపారు. ధాన్యం కొనుగోలు చేసిన తర్వాత 48 గంటల్లో డబ్బులు ఇచ్చేలా చూడాలని ఆదేశించారు. గోనె సంచులు కూడా ఇవ్వలేని దుస్థితి ఉండకూడదన్నారు. రైతు సంక్షేమే ధ్యేయంగా పని చేయాలని సూచించారు. మిల్లెట్లను ప్రమోట్ చేయాలన్నారు. ప్రతి జిల్లా కలెక్టర్ ద్రవ్యోల్బణం విషయంలో జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. ధరలు పెరగకూడదనే గతంలో రైతు బజార్లు ఏర్పాటు చేశారని చెప్పారు. రైతు బజార్లు ధరల నియంత్రణ వంటి అంశాలపై ఎప్పటికప్పుడు పర్యవేక్షించేందుకు మరో జేసీని పెట్టాలని అన్నారు. ఎస్సీ వర్గీకరణకు ఆమోదం తెలిపామని అన్నారు. రజక వర్గాన్ని తొలిసారిగా అసెంబ్లీకి తెచ్చామని వివరించారు. అరకు కాఫీ బ్రాండ్‌ను మరింతగా వర్కవుట్ చేయాలని తెలిపారు. అరకు కాఫీ బ్రాండ్‌ను మరింతగా ప్రమోట్ చేస్తే.. ఎస్టీలకు న్యాయం జరుగుతుందని చెప్పారు. కుల వృత్తులు చేసుకునే వారికి న్యాయం చేయాల్సిన అవసరం ఉందని.. వీరికి స్కిల్ డెవలప్మెంట్ అందించాలని ఆదేశించారు. కుల వృత్తుల్లోకి వేర్వేరు కులాలు వారు వచ్చేస్తున్నారని తెలిపారు. బీసీలకు ఎకనామిక్ యాక్టివిటీని లింక్ చేసేలా చూడాలని ముఖ్యమంత్రి చంద్రబాబు ఆదేశించారు.

## ఢిల్లీలో నల్లటి వస్త్రాలతో నిరసనలు..

(మొదటి పేజి తరువాయి..)




ఢిల్లీలోని బంగ్లాదేశ్ హైకమిషన్‌లో పనిచేస్తున్న ఉద్యోగుల వ్యవహారం చర్చనీయాంశం అయింది. ఉద్యోగులంతా తమ జేబులకు నల్లటి వస్త్రాలను చుట్టుకుని ఆఫీసులకు వచ్చారు. అయితే ఇది బంగ్లాదేశ్‌లో జరిగిన హింసాకాండకు వ్యతిరేకంగా నిరసన తెలపడానికా లేదా నిరసనలకు మద్దతు తెలపడానికా అనేది స్పష్టంగా తెలియరాలేదు.

### సైనిక పాలన.. త్వరలోనే తాత్కాలిక ప్రభుత్వం

షేక్ హసీనా ప్రధానమంత్రి పదవికి రాజీనామా చేయడంతో ఆ దేశ ఆర్మీ చీఫ్ కీలక ప్రకటన చేశారు. దేశంలో సైనిక పాలన విధిస్తున్నట్టు ప్రకటించారు. శాంతి భద్రతలను అదుపులోకి తీసుకొచ్చేందుకు ప్రయత్నిస్తామని స్పష్టం చేశారు. దేశంలోని అన్ని పార్టీలతో చర్చించి ఆందోళనలను అదుపులోకి తీసుకొస్తామని వివరించారు. భద్రత కోసం ప్రధానమంత్రి షేక్ హసీనా దేశం విడిచి వెళ్లిపోయారని, దేశంలో శాంతిని నెలకొల్పేందుకు ప్రజలంతా సహకరించాలని కోరారు. బంగ్లాదేశ్‌లో త్వరలోనే తాత్కాలిక ప్రభుత్వం ఏర్పాటు కానున్నట్లు తెలుస్తోంది. బంగ్లాదేశ్ పరిణామాల నేపథ్యంలో భారత్ నుంచి బంగ్లాదేశ్ వెళ్ళే ఎయిర్ ఇండియా విమాన సర్వీసులను రద్దు చేస్తున్నట్లుఎయిర్ ఇండియా ప్రకటించింది. ప్రయాణికులు సహకరించాలని కోరింది.

# అధికారులకు స్వీట్ వార్నింగ్.. తేడా వస్తే అంతే సంగతులు....

(మొదటి పేజి తరువాయి..)

జరగడానికి వీల్లేదని చంద్రబాబు క్లారిటీ ఇచ్చారు. తప్పు చేయాలని తాను అధికారులకు చెప్పబోనని.. కాని ప్రజాప్రతినిధులు అధికారుల దృష్టికి తీసుకొచ్చే సమస్యల పరిష్కారానికి అధిక ప్రాధాన్యత ఇవ్వాలని సీఎం సూచించారు. విధి నిర్వహణలో అలసత్వం ప్రదర్శిస్తే మాత్రం చర్యలు తప్పవని హెచ్చరించారు. అద్భుతాలు సృష్టించగల ఎంతోమంది మంచి అధికారులు ఉన్నప్పటికీ.. వారి సేవలను ఉపయోగించుకోవడంలో గత ప్రభుత్వం విఫలమైందని చెప్పారు. ఓ రకంగా చెప్పాలంటే ఉన్నతాధికారులకు సీఎం చంద్రబాబు మొదటి సదస్సులోనే స్వీట్ వార్నింగ్ ఇచ్చారు.చంద్రబాబు నాయుడు కలెక్టర్ల సదస్సులో మాజీ సీఎం జగన్ పేరు ఎత్తకుండానే.. ఆయన వ్యవహారశైలిని అధికారులకు అర్థమయ్యేలా చెప్పారు. ఎమ్మెల్యేలంతా ప్రజలకు జవాబుదారీగా ఉండాలని, ప్రజలకు అందుబాటులో ఉండాలని ఇప్పటికే ఆదేశించామని, అధికారులు సైతం ప్రజలకు, ప్రజాప్రతినిధులకు అందుబాటులో ఉండాలని చంద్రబాబు దిశానిర్దేశం చేశారు.




అహంకారపూరిత ధోరణితో, డిక్టేటర్‌గా వ్యవహరిస్తే ఏమవుతుందో ఇటీవల జరిగిన ఎన్నికల ఫలితాలు చూస్తే అర్థమవుతుందన్నారు. ప్రజలు మ్యాండేట్ ఇవ్వడంతోనే ప్రభుత్వాన్ని ఏర్పాటు చేశామని.. ఐదేళ్ల తర్వాత మళ్లీ ప్రజల్లోకి వెళ్లి ఓట్లు అడుగుతామని.. వారి ఓట్లు వేస్తే మరోసారి ప్రభుత్వంలోకి వస్తామని.. లేకపోతే అసెంబ్లీకి కూడా రాలేమన్నారు. గత ప్రభుత్వం డిక్టేటర్‌గా వ్యవహరించడంతోనే మాజీ మంత్రులంతా ఎన్నికల్లో ఓడిపోయారని కేవలం ఒకరు మాత్రమే గెలిచి అసెంబ్లీకి వచ్చారని చంద్రబాబు గుర్తు చేశారు. దీంతో అధికారులు ఎలా ఉండాలనేదానిపై సీఎం చంద్రబాబు ఓ సందేశాన్నిచ్చారు.

### ఓనర్‌షిప్ తీసుకోవాలి.. క్రెడిట్ మాత్రం

ప్రజాప్రతినిధులతో అధికారులు ఎలా వ్యవహరించాలనేదానిపై చంద్రబాబు కలెక్టర్ల సదస్సులో క్లారిటీ ఇచ్చారు. ప్రజల్లో ఉండేది నాయకులని.. ఐదేళ్లకోసారి ప్రజాతీర్పును కోరవల్సి ఉంటుందన్నారు. ఎవరైనా ప్రజాప్రతినిధులు సమస్యలను అధికారుల దృష్టికి తీసుకొస్తే తక్షణమే వాటిని పరిష్కరించి.. ఆ క్రెడిట్‌ను నాయకుడికి ఇవ్వాలని.. అధికారులు ఆ సమస్యను సొంత సమస్యగా భావించి.. త్వరితగతిన పరిష్కార మార్గం చూపించాలన్నారు. మొదటి సదస్సులో ప్రారంభ ఉపన్యాసంలోనే అధికారులు ఎలా ఉండాలో చంద్రబాబు పూసగుచ్చినట్లు వివరించారు.

## శ్రీశైలం దేవస్థానంలో శ్రావణమాసోత్సవాలు...

(మొదటి పేజి తరువాయి..)

శ్రీశైలం : ప్రముఖ ద్వాదశ జ్యోతిర్లింగ క్షేత్రం, అష్టాదశ శక్తిపీఠమైన శ్రీశైలం దేవస్థానంలో శ్రావణమాసోత్సవాలు ప్రారంభమయ్యాయి. ఉత్సవాల్లో భాగంగా ఉదయం 3 గంటలకు మల్లికార్జున స్వామి, భ్రమరాంబ అమ్మవార్ల ఆలయ ద్వారాలు తెరిచి.. ప్రాతఃకాల పూజలు నిర్వహించారు. 4.30 గంటల నుంచి భక్తులకు దర్శనాలకు అనుమతించారు. భక్తులు వేకువజాము నుంచే భక్తులు పాతాళగంగలో స్నానాలు చేసి స్వామి, అమ్మవార్ల దర్శనం కోసం బారులు తీరారు. సాయంత్రం కాలం వరకు భక్తులు దర్శనాలు చేసుకున్నారు. నాలుగు వరుసల క్యూలైన్లలో భక్తులకు దర్శనాలు కల్పించారు. క్యూలైన్లలో భక్తులకు మంచినీరు, బిస్కెట్స్, అల్పాహారం అందించారు. భక్తుల రద్దీని దృష్టిలో పెట్టుకొని గర్భాలయ అభిషేకాలు, సామూహిక అభిషేకాలు, ఆర్జిత కుంకుమార్చలను నిలిపివేశారు. భక్తుల రద్దీకి అనుగుణంగా సిబ్బంది ఏర్పాట్లు చేశారు. మరో వైపు ఉదయం 10.30 గంటల నుంచి భక్తులకు అన్నప్రసాద వితరణ భవనంలో అన్నదానం చేశారు. అలాగే, రాత్రి 7 గంటల నుంచి అల్పహారం ఏర్పాటు చేయనున్నట్లు ఆలయ అధికారులు తెలిపారు. ఆలయానికి వచ్చిన భక్తులతో ఆలయ పరిసరాలన్నీ కిక్కిరిసిపోయాయి.

### శివచతుస్సప్తాహ భజనలు

శ్రావణ మాసం సందర్భంగా ఆలయంలో శివచతుస్సప్తాహ భజనలు ప్రారంభమయ్యాయి. సోమవారం ప్రారంభమైన ఈ భజన కార్యక్రమాలు రేయింబవళ్లు నిరంతరాయంగా కొనసాగనున్నాయి. పవిత్ర అఖండ భజనలు శ్రావణమాస ప్రారంభం సందర్భంగా ఆలయ ప్రాంగణంలోని వీరశిరోమండపంలో ప్రారంభించగా.. ఈవో పెద్దిరాజు, అర్చకులు పాల్గొన్నారు. ముందుగా వేదపండితులు లోక కల్యాణాన్ని కాంక్షిస్తూ సంకల్పం పఠించారు. అనంతరం కార్యక్రమం విజయవంతంగా సాగాలని మహాగణపతిపూజ జరిపించారు. అనంతరం శాస్త్రోక్తంగా చండీశ్వరస్వామివారికి విశేషపూజలు నిర్వహించి.. శివప్రణవ పంచాక్షరీనామ భజనను మొదలుపెట్టారు. ఏపీలోని కర్నూలుకు చెందిన అయిదు భజన బృందాలు, కర్ణాటకకు



చెందిన మూడు భజన బృందాలకు ఈ శ్రావణమాస శివభజనలు చేసేందుకు అవకాశం కల్పించారు. ఎనిమిది బృందాలు విడతలవారీగా భజన కార్యక్రమాలు కొనసాగించనున్నారు.

# బంగ్లాదేశ్‌లో రాజకీయ అస్థిరత

(మొదటి పేజి తరువాయి..)

బంగ్లాదేశ్ ప్రధాని పదవికి షేక్ హసీనా రాజీనామా చేశారు.

### రాజీనామాకు కారణం ఏంటి?

పాకిస్తాన్ నుంచి బంగ్లాదేశ్ విముక్తి కోసం 1971లో జరిగిన యుద్ధంలో పోరాడిన వారి పిల్లలకు ప్రభుత్వ ఉద్యోగాల్లో రిజర్వేషన్లు కల్పించే విధానాన్ని వ్యతిరేకిస్తూ యూనివర్సిటీ విద్యార్థులు చాలా రోజులుగా నిరసన ప్రదర్శనలు నిర్వహిస్తున్నారు. 1971 నాటి బంగ్లా విముక్తి పోరాటంలో పాల్గొన్న వారిని ఇక్కడ యుద్ధవీరులుగా పేర్కొంటారు. ప్రభుత్వ ఉద్యోగాల్లో మూడింట ఒక వంతు వారి పిల్లలకు రిజర్వ్ చేశారు. మరికొన్ని ఉద్యోగాలు మహిళలు, మైనారిటీలు, వికలాంగులకు రిజర్వ్ అయి ఉంటాయి. యుద్ధవీరుల పిల్లల కోసం మూడింట ఒకవంతు పోస్టులు కేటాయించడం వివక్షతో కూడుకున్నదని, ప్రతిభ ఆధారంగానే రిక్రూట్‌మెంట్ జరగాలని కొందరు విద్యార్థులు డిమాండ్ చేస్తున్నారు. 2018లో ఇలాంటి నిరసనలే వెల్లువెత్తడంతో షేక్ హసీనా ప్రభుత్వం ఈ రిజర్వేషన్లను రద్దు చేసింది. కానీ, ఆ కోటాను పునరుద్ధరించాలని 2024 జూన్ ప్రారంభంలో హైకోర్టు ఇచ్చిన తీర్పు తాజా ఆందోళనలకు దారితీసింది. హైకోర్టు ఇచ్చిన ఆ ఆదేశాలను రద్దు చేయాలని అటార్నీ జనరల్ సుప్రీంకోర్టులో పిటిషన్ దాఖలు చేశారు. దీంతో, తాజా విచారణ అనంతరం హైకోర్టు తీర్పును సుప్రీంకోర్టు తోసిపుచ్చింది. 93 శాతం ఉద్యోగాలను మెరిట్ ఆధారంగా ఇవ్వాలని, స్వాతంత్ర్య సమరయోధుల కుటుంబాలకు 5 శాతం, మైనార్టీలకు 1 శాతం, వికలాంగులు, థర్డ్ జెండర్‌లకు 1 శాతం రిజర్వేషన్ ఇవ్వాలని సుప్రీంకోర్టు చెప్పింది. అయినా కూడా దేశంలో నిరసనలు ఆగలేదు. కోటా రద్దు డిమాండ్ను వదిలి షేక్ హసీనా ప్రధాని పదవి నుంచి దిగిపోవాలన్న డిమాండ్‌తో నిరసనలు తీవ్ర రూపందాల్చాయి.

గత కొన్నేళ్లుగా షేక్ హసీనా, ఆమె ప్రభుత్వానికి భారత్ బలమైన మిత్రదేశంగా ఉంది.

### హసీనా భారత్‌కే ఎందుకొస్తున్నారు?



రాజీనామా అనంతరం షేక్ హసీనా భారతదేశానికి పయనమయ్యారు. భారత్ తనకు "సురక్షితమైన ప్రదేశం"గా ఆమె పరిగణించారు. గత కొన్నేళ్లుగా షేక్ హసీనా, ఆమె ప్రభుత్వానికి భారత్ బలమైన మిత్రదేశంగా ఉంది. బంగ్లాదేశ్ అనేక ఈశాన్య భారత రాష్ట్రాలతో సరిహద్దులను పంచుకుంటోంది, ఈ ప్రాంతాలు చాలావరకు తీవ్రవాద సమస్యలను ఎదుర్కొన్నాయి. హసీనా తన పదవీ కాలంలో బంగ్లాదేశ్ కేంద్రంగా పనిచేసే భారత వ్యతిరేక మిలిటెంట్ గ్రూపులపై చర్యలు తీసుకున్నారు. ఇది భారతదేశంతో బంగ్లాదేశ్ సంబంధాలను బలోపేతం చేసింది. అంతేకాదు భారత్ నుంచి బంగ్లాదేశ్ మీదుగా ఈశాన్య రాష్ట్రాలకు సరకులు రవాణా చేయడానికి హసీనా ప్రభుత్వం హక్కులను మంజూరు చేసింది. ఈ మద్దతు రెండు దేశాల మధ్య సంబంధాన్ని మరింత పటిష్టం చేసింది. షేక్ హసీనా 1996లో బంగ్లాదేశ్ ప్రధానిగా ఎన్నికైనప్పటి నుంచి భారతదేశంతో సన్నిహితంగా ఉన్నారు. ఆమె ఢాకా, ఢిల్లీల మధ్య సంబంధాలను సమర్థించారు. బంగ్లాదేశ్ కోసం 1971లో స్వాతంత్ర్య సమరంలో భారత్ నుంచి అందిన కీలకమైన మద్దతును 2022లో ఇండియా పర్యటన సందర్భంగా హసీనా గుర్తు చేసుకున్నారు. అయితే, ఒక నిర్దిష్ట రాజకీయ పార్టీ (హసీనా పార్టీ)తో సన్నిహితంగా ఉండడం కాకుండా బంగ్లాదేశ్ ప్రజల విస్తృత ప్రయోజనాలకు భారత్ మద్దతు ఇవ్వాలని అక్కడి ప్రతిపక్షాలు విమర్శించాయి.

### బంగ్లాదేశ్ ఆర్మీ చీఫ్

బంగ్లాదేశ్‌లో ఇప్పుడు అధికారంలో ఎవరున్నారు?

బంగ్లాదేశ్‌లో 2024లో సార్వత్రిక ఎన్నికలు జరిగాయి.

ప్రతిపక్ష బంగ్లాదేశ్ నేషనల్ పార్టీ ఆ ఎన్నికలను బహిష్కరించింది. ఎన్నికల్లో అవామీ లీగ్, దాని మిత్రపక్షాలు 300 స్థానాలకు గానూ 225 స్థానాలలో గెలిచాయి. దీంతో అవామీ లీగ్ పార్టీ నాయకురాలిగా ఉన్న షేక్ హసీనా ఇన్నాళ్లు ప్రధానిగా కొనసాగారు. ఆందోళనల నేపథ్యంలో ఆమె పదవికి రాజీనామా చేయడంతో ప్రతిష్టంభన ఏర్పడింది. దేశ ప్రజలనుద్దేశించి మాట్లాడిన ఆర్మీ చీఫ్ మధ్యంతర ప్రభుత్వం ఏర్పడుతుందని చెప్పినప్పటికీ , ప్రభుత్వాన్ని ఎవరు నడిపిస్తారనే విషయంలో స్పష్టత ఇవ్వలేదు.

భారత ప్రభుత్వం ఎలా స్పందించింది? విపక్షాలు ఏమంటున్నాయి

బంగ్లాదేశ్'లో రాజకీయ అస్థిరత, షేక్ హసీనా రాజీనామాలపై భారత్ ఇప్పటివరకు అధికారికంగా స్పందించలేదు. షేక్ హసీనా తొలుత భారత్‌లోని అగర్తలకు, అక్కడి నుంచి దిల్లీకి చేరుకున్నప్పటికీ భారత ప్రభుత్వం వైపు నుంచి దీనిపై ఎవరూ స్పందించలేదు. అయితే, షేక్ హసీనా ప్రయాణించిన సీ-130 విమానం ల్యాండ్ అయిన దిల్లీ సమీపంలోని హిండన్ ఎయిర్‌బేస్‌కు జాతీయ భద్రత సలహాదారు అజిత్ డోభాల్ వెళ్లినట్లు ఏఎన్ఐ వార్తాసంస్థ తెలిపింది.మరోవైపు లోక్‌సభలో ప్రతిపక్ష నేత, కాంగ్రెస్ ఎంపీ రాహుల్ గాంధీ విదేశీ వ్యవహారాల మంత్రి జైశంకర్‌తో భేటీ అయ్యారు. వారిద్దరూ బంగ్లాదేశ్ వ్యవహారాలపై చర్చించినట్లు కాంగ్రెస్ వర్గాలను ఉటంకిస్తూ ఏఎన్ఐ తెలిపింది. మరోవైపు బంగ్లాదేశ్‌లో ఉన్న భారతీయుల భద్రతకు భారత ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని, సరిహద్దులలో అప్రమత్తంగా ఉండాలని.. బంగ్లాదేశ్‌లో తాజా పరిణామాల నేపథ్యంలో భారత వైఖరి ఏంటో దేశ ప్రజలకు తెలియజెప్పాలని కాంగ్రెస్ నేతలు, కార్తీ చిదంబరం, మనీశ్ తివారి, గౌరవ్ గొగోయి వంటివారు సూచించారు. బంగ్లాదేశ్‌తో సరిహద్దులున్న భారత రాష్ట్రం పశ్చిమ బెంగాల్ సీఎం దీనిపై మాట్లాడుతూ.. బెంగాల్ ప్రజలు శాంతియుతంగా ఉండాలని, వదంతులు నమ్మరాదని కోరారు. ఇది రెండు దేశాలకు సంబంధించిన విషయం కాబట్టి కేంద్ర ప్రభుత్వం ఎలాంటి నిర్ణయం తీసుకున్నా తాము పూర్తిగా సహకరిస్తామని ప్రకటించారు.

## పాతనగరం మెట్రోకే రూ.2300 కోట్ల అంచనా..

(మొదటి పేజి తరువాయి..)

ఉన్న పాతబస్తీ మెట్రో మార్గాన్ని చాంద్రాయణగుట్ట వరకు పొడిగిస్తూ దానికి ప్రత్యేకంగా డీపీఆర్ సిద్ధం చేయగా, మిగతా 5 కారిడార్లకు డీపీఆర్‌లను ఆగస్టు 15 నాటికి రాష్ట్ర ప్రభుత్వం ముందుంచాలని లక్ష్యంగా పెట్టుకున్నారు. 5 మెట్రో కారిడార్లకు వేర్వేరుగా డీపీఆర్‌లు సిద్ధం చేసి టెండర్లు పిలిచి వేర్వేరు నిర్మాణ సంస్థలకు పనులు అప్పగించేలా కార్యాచరణ సిద్ధం చేస్తున్నారు. మొత్తం ఒకే సంస్థకు ఇవ్వకుండా 5 కారిడార్లను వేర్వేరు సంస్థలకు ఇవ్వడం ద్వారా ఒకే సమయంలో అన్ని కారిడార్ల పనులు ఆయా నిర్మాణ సంస్థలు చేపట్టేలా చర్యలు తీసుకోనున్నారు.

### కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల నుంచే 50% నిధులు..

మొదటి దశ మెట్రోను పూర్తిగా పీపీపీ విధానంలో నిర్మిస్తే, రెండో దశను పూర్తిగా కేంద్ర,రాష్ట్ర ప్రభుత్వాలే నిధులను సమకూర్చనున్నాయి. మొత్తం వ్యయంతో కేంద్ర ప్రభుత్వం 15శాతం, రాష్ట్ర ప్రభుత్వం 35 శాతం భరిస్తే, మిగతా 50 శాతంలో 45 శాతం రుణాల ద్వారా, మరో 5 శాతం వ్యయాన్ని పీపీపీ విధానంలో సమకూర్చుకునేలా రెండో దశ ఎమ్మెట్రో నిర్మాణానికి ప్రతిపాదనలు సిద్ధం చేశారు. 2029 నాటికి రెండో దశను పూర్తి చేయాలన్న లక్ష్యంతో ప్రాజెక్టు డిజైన్‌తో పాటు నిధులను సమకూర్చుకునే ప్రణాళికను డీపీఆర్‌తో పాటు ప్రభుత్వానికి అందజేయనున్నారు. మొత్తం 5 కారిడార్లలో నిర్మించే మెట్రో రెండో దశకు కారిడార్ల వారీగా వ్యయాన్ని అంచనా వేస్తూ డీపీఆర్‌ను సిద్ధం చేస్తున్నారు. ఇందులో అత్యధికంగా నాగోల్ నుంచి శంషాబాద్ ఎయిర్‌పోర్టు లోపలి వరకు



సుమారు 31 కి.మీ మెట్రోకు రూ.8500 కోట్ల దాకా వ్యయం అవుతుంది. ఎయిర్‌పోర్టు కారిడార్ నిర్మాణంలో జీఎంఆర్ ఎయిర్‌పోర్టు సంస్థ సైతం భాగస్వామిగా ఉండనున్నది. గతంలో కేసీఆర్ ప్రభుత్వం రాయదుర్గం నుంచి ఓఆర్ఆర్ వెంబడి ప్రతిపాదించిన మెట్రో మార్గంలో నిర్మాణానికి ఆ సంస్థ సుమారు రూ. 625 కోట్ల వరకు వెచ్చించేందుకు ముందుకు వచ్చింది. ఇలా ఒక్కో కారిడార్‌ను వేర్వేరుగా నిర్మించేందుకు వీలుగా డీపీఆర్‌లను రెడీ చేస్తున్నారు.

పాతనగరంలో మెట్రో మార్గాన్ని నిర్మించే రోడ్డు విస్తీర్ణం చాలా తక్కువగా ఉంది. ఆ మార్గాన్ని 60 నుంచి 80 అడుగుల మేర విస్తరించాలంటే ఆస్తుల సేకరణ ఎక్కువ మొత్తంలో చేయాలి. ఈ మార్గంలో విద్యుత్ స్తంభాలు, మంచినీటి లైన్లు, డ్రైనేజీ లైన్స్, కేబుల్స్‌ను మరో చోటుకు తరలించాల్సి ఉంటుందని, సుమారు రూ.200 కోట్లు వ్యయం అవుతుందని మెట్రో అధికారి తెలిపారు. మతపరమైన కట్టడాలు సైతం 100కు పైగా ఉండడంతో వీటికి ఎలాంటి ఆటంకం కలుగకుండా నిర్మాణాలు చేపట్టాలంటే.. చాలా సమయం తీసుకుంటుంది. 7.5 కి.మీ మెట్రో కారిడార్‌లో భారీ ఎత్తున ఆస్తులను సేకరించాల్సి వస్తోందని అధికారులు చెప్పారు. ప్రతిపాదిత మెట్రో మార్గంలో సుమారు 1100లకు పైగా ఆస్తులు ఉన్నాయని, వాటన్నింటికీ పరిహారాన్ని చెల్లించాలంటే మొత్తం ప్రాజెక్టు వ్యయంలో సగం ఆస్తుల సేకరణకే వెచ్చించాల్సి ఉంటుందన్నారు. ఈ లెక్కన పాతనగరం మెట్రోకే రూ.2300 కోట్ల దాకా ఖర్చు చేయాల్సి ఉంటుందని పేర్కొంటున్నారు.



# టి. నరసాపురం ఎస్సైగా . జయ బాబు బాధ్యతలు స్వీకరించారు

ఏలూరు జిల్లా **ఆగస్టు 05 జనం రిపోర్టర్ :** టీ .నర్సాపురం మండలం నూతన ఎస్సైగా బాధ్యతలు స్వీకరించిన జయ బాబు ఎస్పీ ప్రతాప్ శివకుమార్ ఆదేశాల మేరకు ఉత్తర్వులు జారీ చేశారు గతంలో బుట్టాయిగూడెం కొయ్యలగూడెం తడికలపూడి పోలీస్ స్టేషన్లో ఎస్సైగా పనిచేశారు, బదిలీపై తడికలపూడి వెళ్లారు, తాజాగా టీ. నర్సాపురం బదిలీపై వచ్చారు

# జీలుగుమిల్లి జనసేన టౌన్ ప్రెసిడెంట్ గా ఎన్నికైన కోలా మధు కుమార్



జీలుగుమిల్లి **ఆగస్టు 05 జనం రిపోర్టర్ :** ఏలూరు జిల్లా జీలుగుమిల్లి మండలం జనసేన పార్టీ టౌన్ ప్రెసిడెంట్ గా ఎన్నికైన కోల మధు కుమార్ ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పార్టీ కోసం కష్టపడినటువంటి ఏకార్యకర్తకు అన్యాయం జరగదు పార్టీలో ఎవరైతే కష్టపడతారు వాళ్లకి ఫలితం అనేది ఉంటుందని ఆయన అన్నారు పార్టీ కోసం 2019 నుండి ఎన్నో ఉద్యమాలు చేస్తూ ఎవరికీ ఏ కష్టం వచ్చినా నేనున్నానని అంటూ యువతని ముందుండి నడిపించి నటువంటి వ్యక్తి



కోలా మధు కుమార్ అలాగే పార్టీ కోసం ఎమ్మెల్యే చిర్రి బాలరాజు మండల ప్రెసిడెంట్ పసుపులేటి రాము అడుగుజాడల్లో నడుస్తూ శిరసా వంచి పార్టీ నన్ను గుర్తించి నాకు ఇచ్చినటువంటి ఈ విలువైన స్థానాన్ని నాసైనికులకు అండగా ఉంటానని నా వంతుగా పార్టీ కోసం అహర్నిశలు కష్టపడి స్థానిక ఎన్నికల్లో జనసేన జెండా జీలుగుమిల్లి మండల లోని ఎగర వేస్తానని ఆయన అన్నారు జీలుగుమిల్లి గ్రామంలో ఏ సమస్య వచ్చినా రోడ్లు మంచినీటి సమస్య ఏదైనా నా దృష్టికి తీసుకొస్తే అధికారులు దృష్టికి తీసుకెళ్లి సమస్యను పరిష్కరిస్తానని ఆయన అన్నారు

# కుక్కునూరు మండలం తెలుగుదేశం పార్టీ సీనియర్ నాయకులు మాజీ సొసైటీ అధ్యక్షులు కోటగిరి సత్యనారాయణ జన్మదిన వేడుకలు ఘనంగా జరిగాయి



కుకునూరు **ఆగస్టు 05 జనం రిపోర్టర్ :** ఏలూరు జిల్లా కుక్కునూరు మండలం తెలుగుదేశం పార్టీ సీనియర్ నాయకులు కోటగిరి సత్యనారాయణ మాజీ సొసైటీ అధ్యక్షులు జన్మదిన వేడుకలు మండల అధ్యక్షులు నాగు ఆధ్వర్యంలో ఘనంగా జరుపుకున్నారు ఈ కార్యక్రమంలో మునిశెట్టి నాగు వారి సతీమణి ఉషారాణి సన్మానించి శ్రీ వెంకటేశ్వర స్వామి ఫోటోను బహుకరించారు ఈ కార్యక్రమంలో తెలుగుదేశం పార్టీ మండల నాయకులు కార్యకర్తలు అభిమానులు పాల్గొన్నారు, రానున్న రోజుల్లో కోటగిరి సత్యనారాయణ పార్టీ అధిష్టానం గుర్తించి ఉన్నత పదవుల్లో ఉండేవిధంగా ఉండాలని మండల నాయకులు అన్నారు, కోటగిరి సత్యనారాయణ ఎన్నో సంవత్సరాలుగా తెలుగుదేశం పార్టీ ఎన్టీ రామారావు దగ్గర నుండి పార్టీకి కట్టుబడి పార్టీ కోసం కష్టపడి ఉన్నారని అధిష్టానం గుర్తించి గుర్తింపు పొందే విధంగా మంచి పదవులు ఆయనకి ఇవ్వాలని కుక్కునూరు మండల ప్రజలు కార్యకర్తలు అన్నారు




# ఆర్డీవో కార్యాలయానికి



**ఆగస్టు 05 జనం రిపోర్టర్ :** రెవిన్యూ డివిజనల్ అధికారి వారి కార్యాలయం నందు ప్రజా సమస్యల పరిష్కార వేదిక కార్యక్రమం నిర్వహించడం జరిగినది సదరు కార్యక్రమమును రెవెన్యూ డివిజనల్ అడ్మినిస్ట్రేటివ్ ఆఫీసర్ అయినటువంటి పి జాన్ పీటర్ గారు నిర్వహించడం జరిగినది.

## సదరు కార్యక్రమమునకు వచ్చిన ఫిర్యాదులు

నగరం మండలం సజ్జా వారి పాలెం శివారు ఉలిపాలెం దగ్గర వైన్ షాప్ ఉండుటవలన ముందు సీసాలను పంట కాలవలోనూ రహదారి బాటలోనూ దాని చుట్టుపక్కల ఉండు పొలాల యందు వేయిట వలన మరియు దాని చుట్టుప్రక్కల స్కూలు ఉండటం వలన ప్రజలకు చాలా అసౌకర్యంగా ఉంటుందని కావున సదరు సమస్యను పరిష్కరించవలసిందిగా కోరుతూ ఒక అర్జీ రేపల్లె మండలం 13వ వార్డు వేమూరి తిరుపతిరావు అన్న వారు తనకు నీటి కనెక్షన్ లేకపోయినా వాటర్ టాక్స్ వచ్చిందని కావున వాటర్ ట్యాక్స్ ను రద్దు పరచవలసిన గా కోరతూ ఒక అర్జీ . రేపల్లె మండలం పిరాట్లంక గ్రామ కాపరుస్తులైన నీలా అప్పారావు గారి మురుగునీరు సమస్యను తీర్చవలసిందిగా కోరుతూ ఒక అర్జీ . నిజాంపట్నం మండలం పల్లపట్ల గ్రామం నుండి మట్లపూడి నాగేశ్వరరావు మరియు బేతపూడి భీమయ్య అనువారు కాలవ పోరంబోకును తమకు 1985 సంవత్సరము నందు కొబ్బరి చెట్లు పెంచుకోమని ఇచ్చ

# వరదల్లో ఇబ్బంది పడ్డ ఉద్యోగస్తులకు మూడువేల చెల్లించాలని వినతి



వి.ఆర్.పురం, **ఆగస్టు 05 జనం రిపోర్టర్ :** మండలంలోని గోదావరి, శబరి వరదల కారణంగా ఇబ్బందులు ఎదుర్కొన్న ఉద్యోగస్తులకు మూడువేల రూపాయలు తక్షణమే ఇవ్వాలని, సోమవారం మండల తహసీల్దార్ కు సిపిఎం పార్టీ మండల కమిటీ ఆధ్వర్యంలో వినతి పత్రం ఇవ్వడం అందజేశారు. ఈ సంద్భంగా వారు మాట్లాడుతూ వరదల్లో ఇల్లు మొత్తం కూడా నీట మునిగి అనేక అవస్థలు ఎదుర్కొన్న ప్రజానికానికి ప్రభుత్వం మూడువేల ఆర్థిక సహాయాన్ని చేసిందని, అదేవిధంగా ఉద్యోగస్తులు ఇల్లు కూడా నీట మునిగాయని వారు ఇబ్బందులు ఎదుర్కొన్నారని వారికి కూడా తక్షణమే వరదల్లో ఇచ్చిన ఆర్థిక సహాయం మూడువేల రూపాయలు ఇవ్వాలని సిపిఎం మండల కమిటీ మండల తాసిల్దార్ ను కోరరు. తహసిల్దార్ కు వినతి పత్రం అందించిన వారిలో సిపిఎం మండల కార్యదర్శి సోయం చిన్నబాబు, జిల్లా నాయకులు పూనెం.సత్యనారాయణ, మండల ఎంపీపీ కారం.లక్ష్మి నాయకులు పంకు.సత్తిబాబు, పులి.సంతోష్ కుమార్,కారం.సుందరయ్య, కమ్మచిచ్చు.సత్తిబాబు సోడి.మల్లయ్య, నాళ్లారపు.చంద్రరావు తదితరులు ఉన్నారు.

# తహశీల్దార్ కు ఘన సన్మానం



వి.ఆర్.పురం, **ఆగస్టు 05 జనం రిపోర్టర్ :** ఇక్కడకు వచ్చిన అనాతి కాలంలోనే అతి కష్టతరమైన గోదావరి వరదలు, గతంలో జరిగిన ఎలక్షన్లు, సమర్థవంతంగా నిర్వహించిన విఆర్ పురం తాసిల్దార్ సయ్యద్ మౌలానా ఫాజిల్ బదిలీ పై వెళ్తున్న నేపథ్యం లో వి.ఆర్ పురం వివేకానంద ప్రెస్ క్లబ్ సభ్యులు సోమవారం శాలువాలతో సన్మానించారు. ఈ సందర్భంగా ప్రెస్ క్లబ్ సభ్యులు మాట్లాడుతూ ఇక్కడికి వచ్చిన తక్కువ కాలం లోనే వృతి ,ఉద్యోగం పట్ల వారికున్న నిబద్ధత, అధికారులని ,నాయకులను సమన్వయం చేసుకుంటూ వరద భదిత గ్రామాల్లో ప్రజలు పట్ల ప్రభుత్వం ద్వార రావలసిన సహాయ సహకారాలు అందించారని కొనియాడారు. గతం లో వచ్చిన అధికారులు కు మించి ప్రభుత్వం నుంచి వచ్చే అనేక పథకాలను సద్వినియోగం చేసేవిధంగా అవగాహన పరిచి ప్రతి ఒక్కరు లబ్ధి పొందేలా ఆయన ఎంతో కృషిచేసారని అన్నారు. ఇలాంటి నాయకులు ఈ మండలానికి రావడం ఆనందంగా వుందని వారన్నారు.ఈ కార్యక్రమం లో ప్రెస్ క్లబ్ సభ్యులు దాన్నన రామారావు, మాస్కపల్లి సత్తిబాబు,ఎక్కెలా నాగేంద్రబాబు, గోలి వికాస్, బావి నాగేశ్వర రావు, కప్పల కృపారావు, గూటల వెంకటేష్, కోట్ల నరేష్, వల్లి సుందరం, బుయ్యన సురేష్ , లక్ష్మణ్ , ఎడ్ల విజయరాజు, బండి మహేష్, సతిష్ తదితరులు పాల్గొన్నారు

# మృతుని కుటుంబానికి ఆర్థిక సహాయం అందజేత



రేపల్లె **ఆగస్టు 05 జనం రిపోర్టర్ :** నిజాంపట్నం పంచాయతీ గోకర్ణ మఠం గ్రామానికి చెందిన టిడిపి సీనియర్ కార్యకర్త కొక్కిలిగడ్డ వెంకటేశ్వరరావు అనారోగ్యా కారణంగా మృతి చెందాడు .ఆయన మృతి పట్ల రాష్ట్ర రెవెన్యూ శాఖ మంత్రి అనగాని సత్యప్రసాద్ సంతాపం తెలిపారు. మంత్రి ఆదేశాల మేరకు సోమవారం నిజాంపట్నం టిడిపి సీనియర్ నాయకుడు బొమ్మిడి రామకృష్ణ గోకర్ణ మఠం లో మృతి దేహాన్ని సందర్శించి కుటుంబ సభ్యులను పరామర్శించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పార్టీలో ఉండి కష్టపడి పని చేసిన ప్రతి కార్యకర్తకు వారి కుటుంబాలకు పార్టీ మరియు మంత్రి అనగాని అండగా ఉంటారని భరోసా ఇచ్చారు. ఈ సందర్భంగా కుటుంబ సభ్యులకు 10,000 ఆర్థిక సహాయం అందించారు. ఈ కార్యక్రమంలో టిడిపి నాయకులు నాయుడు నరసింహ మూర్తి మూర్తి, ఖాదర్ బాబు, ఇమ్రాన్ ఖాన్, శీలం కోటేశ్వరావు, కార్యకర్తలు ఉన్నారు.

# థర్డ్ డిగ్రీ ప్రయోగించిన పోలీసులపై చర్యలు ఏవి

## కెవిపిఎస్, ఆల్ ఇండియా లాయర్స్ యూనియన్ ఆధ్వర్యంలో సి పి కి వినతి



రామడుగు, **ఆగస్టు 05 జనం రిపోర్టర్ :** మండలం లోని వెలిచాల గ్రామానికి చెందిన ఎరుకల కులానికి చెందిన కుతాడి కనకయ్య ను గొర్రెల దొంగతనం ఒప్పుకోవాలని పలు మార్లు పోలీస్ స్టేషన్ కు పిలిపించి థర్డ్ డిగ్రీ ప్రయోగించి విచక్షణ రహితంగా కొట్టిన రామడుగు ఎస్ఐ మామిడాల సురేందర్ పై చర్యలు ఎందుకు తీసుకోవడం లేదని కుల వివక్ష వ్యతిరేక పోరాట సంఘం జిల్లా కార్యదర్శి తిప్ప రపు సురేష్, బీఆర్ఎస్ చొప్పదండి నాయకుడు కట్టెకోల లక్ష్మణ్ కుమార్, కొంపెల్లి సాగర్, శ్రీనివాస్ , తిరుపతి బృందం కరీంనగర్ పోలీస్ కమిషనర్ అభిషేక్ మహంతి వినతి పత్రం ఇవ్వడం జరిగింది. ఈ సందర్భంగా మాట్లాడుతూ కుతాడి కనకయ్య ఎరుకల కుటుంబంపై రామడుగు పోలీసులు థర్డ్ డిగ్రీ ప్రయోగించిన వారిపై నేటి వరకు చర్యలు ఎందుకు తీసుకోలేదని అడిగారు. బాధితులకు రాముడుగు ఎస్ఐ నుండి ప్రాణహాని ఉందని ఎస్సైబాధితులను భయభ్రాంతులకు గురి చేస్తున్నారని అన్నారు. రాముడుగు ఎస్సైని సస్పెండ్ చేయాలని బాధితులకు న్యాయం చేయాలని కోరారు. లేనియెడల దశల వారి పోరాటాన్ని కొనసాగిస్తామని తెలిపారు.

# మృతుని కుటుంబానికి ఆర్థిక సహాయం అందజేత



రేపల్లె **ఆగస్టు 05 జనం రిపోర్టర్ :** నిజాంపట్నం పంచాయతీ గోకర్ణ మఠం గ్రామానికి చెందిన టిడిపి సీనియర్ కార్యకర్త కొక్కిలిగడ్డ వెంకటేశ్వరరావు అనారోగ్యా కారణంగా మృతి చెందాడు .ఆయన మృతి పట్ల రాష్ట్ర రెవెన్యూ శాఖ మంత్రి అనగాని సత్యప్రసాద్ సంతాపం తెలిపారు. మంత్రి ఆదేశాల మేరకు సోమవారం నిజాంపట్నం టిడిపి సీనియర్ నాయకుడు బొమ్మిడి రామకృష్ణ గోకర్ణ మఠం లో మృతి దేహాన్ని సందర్శించి కుటుంబ సభ్యులను పరామర్శించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పార్టీలో ఉండి కష్టపడి పని చేసిన ప్రతి కార్యకర్తకు వారి కుటుంబాలకు పార్టీ మరియు మంత్రి అనగాని అండగా ఉంటారని భరోసా ఇచ్చారు. ఈ సందర్భంగా కుటుంబ సభ్యులకు 10,000 ఆర్థిక సహాయం అందించారు. ఈ కార్యక్రమంలో టిడిపి నాయకులు నాయుడు నరసింహ మూర్తి మూర్తి, ఖాదర్ బాబు, ఇమ్రాన్ ఖాన్, శీలం కోటేశ్వరావు, కార్యకర్తలు ఉన్నారు.

# విద్యుత్ హార్ట్ సర్క్యూట్ తో పూరిల్లు దగ్ధం



రేపల్లె **ఆగస్టు 05 జనం రిపోర్టర్ :** విద్యుత్ షార్ట్ సర్క్యూట్ కారణంగా పట్టణంలోని 16వ వార్డులో నివాసముతున్న కట్ట సురేష్ కు చెందిన రాతి గోడల పూరీలు అగ్నికి ఆకుతోయింది. దీంతో కుటుంబ సభ్యులు కట్టుబట్టలతో పిలిచారు సుమారు లక్ష యాభై వేలు నష్టం వాటిల్లినట్టు కుటుంబ సభ్యులు తెలియజేస్తున్నారు. నిప్పు అంటుకోగానే ఫైర్ స్టేషన్కు సమాచారం తెలియజేయడంతో అగ్నిమాకు సిబ్బంది వచ్చి మంటలను అదుపు చేశారు ఇతర ప్రాంతాలకు మంటలు వ్యాపించకుండా ప్రజలు సిబ్బంది తగు చర్యలు తీసుకున్నారు దీంతో పరిసర ప్రాంత ప్రజలు ఊపిరి పీల్చుకున్న

# కీర్తన పిన్ సర్ ప్రైవేట్ లిమిటెడ్ ఆర్థిక సహాయంతో వరద బాధితులకు నిత్యవసర సరుకులు పంపిణీ ముఖ్యఅతిథిగా ఎమ్మెల్యే చిర్రి బాలరాజు



వేలేరుపాడు **ఆగస్టు 05 జనం రిపోర్టర్ :** ఏలూరు జిల్లా వేలేరుపాడు మండలంలో కీర్తన ఫిన్ సర్ ప్రైవేట్ లిమిటెడ్ ఆర్థిక సహాయంతో వరద ముంపుకు గురైన వారికి ఆర్థిక సహాయంతో కీర్తన సంవత్సర లోన్ తీసుకున్న సభ్యులకు నిత్యవసర సరుకులు కీర్తన ఫౌండర్ పద్మజ రెడ్డి ఏర్పాటు చేయడం జరిగింది ఈ కార్యక్రమంలో పోలవరం నియోజవర్గం ఎమ్మెల్యే చిర్రి బాలరాజు జిల్లా కార్యదర్శి గడ్డమనుగు రవికుమార్ , మరియు సంజయ్ సుధాకర్ మోహన్ , గడ్డం వెంకటేశ్వర్లు రావు, బంధం వీరాస్వామి, నాగుల వెంకన్న, ఆవలం వంశీ, యువగలం బూడిపిటి సురేష్, శంకరం, కుంకునూరు మండలం అధ్యక్షులు యుగంధర్ కొయ్యల గూడెం మండలం అధ్యక్షులు తోట రవి జనసేన, కూటమి నాయకులు పాల్గొన్నారు...



# మాజీ జెడ్పిటిసి నల్లూరి చలపతిరావు జన్మదిన వేడుకలు అభిమానుల మధ్య ఘనంగా జరిగాయి



టీ. నర్సాపురం **ఆగస్టు 05 జనం రిపోర్టర్ :** ఏలూరు జిల్లా టి. నరసాపురం మండలం రాజు పోతే పెల్లి స్వగ్రామంలో మాజీ జడ్పిటిసి సభ్యులు అధ్యక్షతన ఆయన ఇంటి వద్ద అభిమానుల మధ్య ఘనంగా జరుపుకున్నారు ఈ కార్యక్రమంలో తెలుగుదేశం పార్టీ జనసేన పార్టీ భారతీయ జనతా పార్టీ నాయకులు కార్యకర్తలు అభిమానులు పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలోని మండల సీనియర్ నాయకులు మాట్లాడుతూ 2014 నుండి 2019 వరకు జడ్పిటిసి గా ఎన్నికై సంవత్సరంలో ఎన్నో అభివృద్ధి కార్యక్రమాలు చేశారని కొనియాడారు అలాగే రోడ్లు డ్రైనేజీలు మంచినీటి సమస్య, కార్యక్రమాలు చేశారని అని అన్నారు మండల నాయకులకి అందుబాటులో ఉంటూ జిల్లాస్థాయిలో గుర్తింపు పొంది నటువంటి వ్యక్తి నల్లూరి చలపతిరావు అని అన్నారు, అలాగే ఉత్తమ జడ్పిటిసి అవార్డు,ఐటీ విద్యాశాఖ నారా లోకేష్ చేతుల మీదుగా ఉత్తమ అవార్డు తీసుకోవడం జరిగింది అని అన్నారు టీ. నర్సాపురం మండల నలుమూలల నుండి ఆయన అభిమానులు వచ్చి కేక్ కటింగ్ చేసి శుభాకాంక్షలు తెలిపారు, శాలువాలతో సన్మానించారు, ఈ కార్యక్రమంలో,మాజీ జడ్పిటిసి కామవరపుకోట గంట సుధీర్ పాల్గొన్నారు, మాజీ సభ్యులు బొంతు సత్యనారాయణ, గుమ్మల బాలరాజు మాజీ సర్పంచ్, తెడ్లిమ్, గ్రామ ప్రెసిడెంట్, కృపా రెడ్డి, జగ్గవరం వెలిది నాగబాబు, మాజీ సర్పంచ్, లింగారెడ్డి శ్రీనివాస్,%రాజు% తెలుగుదేశం సీనియర్ నాయకులు, అల్లం చర్ల సర్పంచ్ నారినీ వెంకట్రావు, తెలుగుదేశం పార్టీ మండల ప్రెసిడెంట్ నాయుడు రామకృష్ణ గౌడ్, గంట సతీష్, తెలుగు యువత రైతు అధ్యక్షులు, మాజీ మండల అధ్యక్షులు పెద్దిన సత్యనారాయణ, రాష్ట్ర బీసీ సెల్ సెక్రెటరీ కొండపల్లి రవి, ఆచంట అనిల్, మండల సెక్రెటరీ, పిన్నమనేని మధు, పోలవరం తెలుగు యువత అధ్యక్షులు, గన్నిన నశిరేంద్ర చౌదరి, జనసేన మండల అధ్యక్షులు అడప నాగరాజు, మండల పార్టీ ఉపాధ్యక్షులు సిద్దా శ్రీను, బిజెపి. రామలింగేశ్వరరావు సీనియర్ నాయకులు, టిడిపి పవన్ కుమార్, కూటమి నాయకులు పాల్గొన్నారు



# తెలంగాణ రాష్ట్ర శాసన సభాపతి

## గడ్డం ప్రసాద్ కుమార్ , మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి , తాండూర్ ఎమ్మెల్యే మనోహర్ రెడ్డి కి పుష్పగుచ్ఛంతో స్వాగతం పలికిన వికారాబాద్ మున్సిపల్ చైర్ పర్సన్ చిగుళ్లపల్లి మంజుల రమేష్..!!



వికారాబాద్ జిల్లా **ఆగస్టు 05 జనం రిపోర్టర్ :** వికారాబాద్ నియోజకవర్గంలో పలు అభివృద్ధి కార్యక్రమాలలో భాగంగా ఈరోజు వికారాబాద్ జిల్లా కేంద్రానికి వచ్చిన తెలంగాణ రాష్ట్ర శాసనసభాపతి గడ్డం ప్రసాద్ కుమార్ , మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి , తాండూర్ ఎమ్మెల్యే మనోహర్ రెడ్డికి వికారాబాద్ మున్సిపల్ చైర్ పర్సన్ చిగుళ్లపల్లి మంజుల రమేష్ పుష్పగుచ్ఛంతో స్వాగతం పలికారు. ఈ సందర్భంగా స్పీకర్, మంత్రి ఇద్దరు కలిసి రూ.12 కోట్లతో ఆలంపల్లి నుండి రాళ్ల చిట్టెంపల్లి వరకు డబల్ రోడ్డు నిర్మాణం, జిల్లా కేంద్రంలో రూ.6 కోట్లతో 4 సూటెడ్ ఆర్ అండ్ బి గెస్ట్ హౌస్ నిర్మాణం, రూ.42 కోట్లతో మర్పల్లి నుండి కోట్ పల్లి వరకు డబుల్ రోడ్డు నిర్మాణ పనుల శిలాఫలక శంకుస్థాపనలు చేశారు. ఈ కార్యక్రమంలో జిల్లా కలెక్టర్ ప్రతీక్ జైన్, రోడ్లు భవనాల శాఖ కార్యదర్శి హరిచందన, ఇంజనీర్ ఇన్ చీఫ్ మోహన్ నాయక్, ఎస్.ఈ వసంత నాయక్, ఇంచార్జ్ ఇఇ శ్రీధర్ రెడ్డి, మున్సిపల్ వైస్ చైర్ పర్సన్ శంషాద్ బేగం, వివిధ శాఖల అధికారులు, ప్రజా ప్రతినిధులు, నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు తదితరులు పాల్గొన్నారు.



# గ్రామం జయగిరిలో స్వచ్ఛదనం - పచ్చదనం కార్యక్రమం గ్రామ కార్యదర్శి రవి గౌడ్



హసన్ పర్తి మండలం **ఆగస్టు 05 జనం రిపోర్టర్ :** హసన్ పర్తి మండల పరిధిలోని గ్రామం జయగిరి లో ఈరోజు స్వచ్ఛదనం పచ్చదనం అనే కార్యక్రమాన్ని పంచాయతీ కార్యదర్శి రవి గౌడ్ ప్రారంభించారు అనంతరం ఆయన మాట్లాడుతూ గ్రామంలోని ప్రతి వార్డులో పరిసరాల పరిశుభ్రతను పాటించాలని, డ్రైనేజీ వ్యవస్థను ఎప్పటికప్పుడు శుభ్రం చేస్తూ గ్రామ ప్రజలకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా చూడాలని,రోడ్ల మీద గాని, వాడలలోని ప్రతి గల్లీలో అక్కడక్కడ ఉన్న చిన్న చిన్న గుంతలను పుడుచాలని, ఏక్కడ కూడా వర్షపు నీరు నిలవకుండా చూడాలని, వ్యక్తిగత పరిశుభ్రత పాటించాలని, గ్రామ ప్రజలకు తెలియజేశారు అదేవిధంగా గ్రామంలోని ఎక్కడైనా సమస్యలు ఉంటే నేరుగా గ్రామపంచాయతీ వద్దకు తీసుకురావాలని తెలియజేశారు అదేవిధంగా పచ్చదనంలో భాగంగా ప్రతి ఇంటి కుటుంబం బాధ్యతతో మొక్కలను నాటి పెంచాలని, ఈ మొక్కలు నాటి పెంచడం వలన మంచి వాతావరణం ఏర్పడి మంచి గాలి మనకు కావలసిన ఆక్సిజన్ మనకు అందుతుందని దీని ద్వారా అనారోగ్య సమస్యలు రాకుండా కాపాడుకోవచ్చని తెలియజేశా అదేవిధంగా వర్షాకాలం సీజన్ వ్యాధుల పట్ల గ్రామస్తులందరూ అప్రమత్తంగా ఉండాలని కాచి వడగట్టిన నీళ్లనే త్రాగాలని చేతులను ఎప్పటికప్పుడు శుభ్రపరుచుకోవాలని పరిసరాల పరిశుభ్రత తో పాటు వ్యక్తిగత పరిశుభ్రతను పాటించాలని తెలియజేశారు ఎందుకంటే ఈ వర్షాకాలం రెయిన్ సీజన్లో వాతావరణ మార్పుల వలన జ్వరం,మలేరియా,డెంగ్యూ దగ్గు,విరోచనాలు,వంటిఅనేక రోగాలు వస్తాయాన్ని కనుక జాగ్రత్తలు పాటించాలని గ్రామ ప్రజలకు తెలియజేశారు అదేవిధంగా వర్షాకాలం లో చేయవలసిన అభివృద్ధి కార్యక్రమాలను చేస్తూ ప్రజలకు అందుబాటులో ఉంటామని తెలియజేశారు ఈఅనంతరం ఈ కార్యక్రమం పై గ్రామంలో ర్యాలీగా తిరుగుతూ, పరిసరాల పరిశుభ్రతపై ప్రజలకు అవగాహన కనిపిస్తూ కార్యక్రమం చేయడం జరిగింది అనంతరం గ్రామంలోని రోడ్ల పక్కన ఉన్న పిచ్చి మొక్కలను తొలగిస్తూ,రోడ్లను శుభ్రం చేస్తూ స్వచ్ఛభారత్ కార్యక్రమాన్ని చేయడం జరిగింది, ఇలాంటి కార్యక్రమాలు మన తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా తీసుకున్న నిర్ణయం పట్ల ప్రజలు ఎంతో సంతోషం వ్యక్తం చేస్తున్నారు ఈరోజు అనగా ఐదవ తారీకు నుండి మొదలు తొమ్మిదో తారీఖు వరకు వివిధ అభివృద్ధి అంశాలపై ఇలాంటి కార్యక్రమాలు నిత్యం కొనసాగుతూ ఉంటాయని తెలియజేశారు కార్యక్రమంలో స్పెషల్ ఆఫీసర్ సిహెచ్ వెంకటేశ్వర్లు,గ్రామ కార్యదర్శి రవి గౌడ్, అంగన్వాడి టీచర్స్,రేణు కుంట్ల సువర్ణ, చింత విజయ, ఉమాదేవి, ఏఎన్ఎం కుమారి,ఆశా వర్కర్ రేణు కుంట్ల శారద, రేణు కుంట్ల రమ, సిఏలు బుర్ర మమత, ఎర్ర హోలియా, కాంగ్రెస్ గ్రామ శాఖ అధ్యక్షులు రామంచ ప్రభాకర్,మాజీ ఎంపిటిసి రేనుకుంట్ల పరమేశ్వరి అశోక్, పోగుల రాజ్ కుమార్,బుర్ర శ్రీధర్, గ్రామ కారోబార్ సాయిని శ్రీధర్, ఫీల్డ్ అసిస్టెంట్ బుర్ర శ్రీధర్, గ్రామ సిబ్బంది మధు,ఐలయ్య,రాజయ్య, చింటూ, అనిల్, ఐలమ్మ, సరోజన, గ్రామస్తులు తదితరులు పాల్గొన్నారు



# మానవత్వం చాటుకున్న ఏసీటీఓలు...!!

## సహా ఉద్యోగికి 4లక్షల 62000 వేలు నగదు అందజేసిన బ్యాచ్ మేట్స్...!!



వికారాబాద్ జిల్లా **ఆగస్టు 05 జనం రిపోర్టర్ :** తెలంగాణ వాణిజ్య శాఖలో అసిస్టెంట్ కమర్షియల్ టాక్స్ అధికారిగా పనిచేస్తున్న వికారాబాద్ జిల్లా నవాబుపేట మండలం లింగంపల్లి గ్రామానికి చెందిన తలారి శంకర్ తండ్రి లింగంపల్లిలోని కాంటినెంటల్ ఆసుపత్రిలో సుమారు 20 రోజులు కార్డియాక్ అరెస్ట్ వల్ల అనారోగ్యంతో మరణించడం జరిగింది.వైద్యానికి మొత్తం రూ.20 లక్షల వరకు అయ్యాయి.ఈ విషయం తెలుసుకున్న తోటి 2020 బ్యాచ్ ఏసిటీఓలు అందరూ కలిసి తన తోటి ఉద్యోగి స్నేహితుడి కష్టాన్ని గుర్తించి బాసటగా నిలవాలని భావించారు.ఎలాగైనా తోటి ఉద్యోగి,స్నేహితుని కుటుంబానికి అండగా నిలవాలని సంకల్పించుకుని బృందంగా ఏర్పడి చేయి చేయి కలిపి చేతనైనంత సాయాన్ని చేయాలని నిర్ణయించారు. అందరు తమకు తోచినంత కలిపి (462000)నాలుగు లక్షల అరవై రెండు వేల నగదును సేకరించిన మొత్తాన్ని మిత్రుడికి అందజేశారు.బ్యాచ్ మేట్ కుటుంబానికి,సహ ఉద్యోగికి ఆర్థిక సహాయం చేసి తామున్నామని భరోసానిచ్చారు.

# ఇప్పటికైనా నీరుపేదలకు ఇండ్ల స్థలాలు మంజూరు చేయాలి...!!

## అదనపు కలెక్టర్ లింగ్యా నాయక్ కి వినతిపత్రం ఇచ్చిన ఎల్లకొండ గ్రామస్తులు...!!





వికారాబాద్ జిల్లా **ఆగస్టు 05 జనం రిపోర్టర్ :** వికారాబాద్ జిల్లా నవాబ్ పేట్ మండలం ఎల్లకొండ గ్రామానికి చెందిన సుమారు 100 మంది నిరుపేద కుటుంబికులు సోమవారం వికారాబాద్ జిల్లా కేంద్రంలోని కలెక్టర్ కార్యాలయంలో అదనపు కలెక్టర్ లింగ్యా నాయక్ తో పాటు,ఆర్డివో కార్యాలయం,నవాబ్ పేట్ తహసీల్దార్ కార్యాలయం వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ హక్కు పత్రాలు ఇచ్చిన పేద కుటుంబాలకు చెందిన ప్రజలకు ఇళ్ల స్థలాలు తక్షణమే కేటాయించాలని చెప్పారు. 2008వ సంవత్సరం ఎల్లకొండ రెవిన్యూ మైతాభ్ ఖాన్ గూడ గ్రామశివారులోని సర్వే నెంబర్ 402లో అప్పటి ప్రభుత్వం ఇళ్ల స్థలాలను కేటాయించడం జరిగింది కానీ అప్పటి తహసీల్దార్ మాకు స్థలాన్ని కేటాయించలేదని చెప్పుకొచ్చారు. అప్పటి నుండి పలుమార్లు వచ్చిన తహసీల్దార్లకు నిరుపేదలమైన మాకు ఇళ్ల స్థలాల కోసం భూమిని లేఅవుట్ గా మార్చి కేటాయించాలని విన్నవించుకున్నా కూడా ఎలాంటి ప్రయోజనం లేకుండా పోయిందని ఆవేదన వ్యక్తం చేశారు. ఇట్టి విషయం పై జాతీయ ఎస్సీ ఎస్టీ కమిషన్ వారి దృష్టికి కూడా తీసుకెళ్లామని చెప్పారు. 2008 నుంచి ఇప్పటివరకు ఇంటి స్థలం కోసం పోరాడుతున్న కూడా తమకు పట్టాలు ఇచ్చి పొజిషన్ ఇవ్వకుండా ఎదురుచూపులే మిగిలిస్తున్నారని తెలిపారు. ఇకనైనా అధికారుల స్పందించి గూడులేని నిరుపేదలమైన మాకు భూమిని లే అవుట్ గా మార్చి స్థలాన్ని కేటాయించాలని కోరుతున్నట్లు చెప్పుకొచ్చారు. ఈ కార్యక్రమం బేగారి గాలయ్య,ఈర్లపల్లి నర్సిములు, అర్జున్ ,ప్రకాష్,న ర్సిములు,జయమ్మ, జంగయ్య, సత్యయ్య గౌడ్, పరమేష్, రూతమ్మ, ఇబ్రహీం ,కిష్టయ్య, తదితరులు పాల్గొన్నారు.

## బసంత్ నగర్ ఇండియా మిషన్ పాఠశాలకు చెందిన ఆరుగురు విద్యార్థులు రోలెస్కేటింగ్ పోటీల్లో ప్రతిభ కనబరిచి బంగారు, వెండి, కంచు పథకాలు సాధించారు....



రామగుండం **ఆగస్టు 05 జనం రిపోర్టర్ :** బసంత్ నగర్ లోని ఇండియా మిషన్ పాఠశాలకు చెందిన ఆరుగురు విద్యార్థులు ఈనెల నాలుగో తేదీన హైదరాబాద్లో జరిగిన రోలెస్కేటింగ్ పోటీల్లో ప్రతిభ కనబరిచి, బంగారు వెండి కంచు పథకాలు సాధించారని పాఠశాల కోచ్ ఎం .కృష్ణమూర్తి గౌడ్ తెలిపారు. ఈ సందర్భంగా పాఠశాలలో జరిగిన కార్యక్రమంలో వీరిని పాఠశాల ప్రిన్సిపల్ మహేంద్ర అభినందించి వారికి బహుమతి ప్రధానం చేశారు ఈ సందర్భంగా తల్లిదండ్రులను, ఉపాధ్యాయులను, కేశోరం సిమెంట్ మేనేజ్మెంట్ వీరిని అభినందించారు. ఎం. వర్షిత్ గోల్డ్ మెడల్, ఎం.చరణ్ సిల్వర్ మెడల్, హేమంత్ సాయి సిల్వర్ మెడల్, గౌతమ్ రిషి బ్రాంజ్ మెడల్, ఎం.రిత్విక్ బ్రాంజ్ మెడల్, మని చరణ్ సిల్వర్ మెడల్ సంపాదించుకున్నరు.

## ప్రజావాణి లో భాగంగా అదనపు కలెక్టర్ లింగ్యా నాయక్ ప్రజల నుండి 141 దరఖాస్తులు...!!





వికారాబాద్ జిల్లా **ఆగస్టు 05 జనం రిపోర్టర్ :** వికారాబాద్ జిల్లా కేంద్రంలోని కలెక్టర్ కార్యాలయంలో ప్రజావాణిలో వచ్చిన అర్జీలను సంబంధిత శాఖల అధికారులు క్షుణ్ణంగా పరిశీలించి ప్రజా సమస్యలు పరిష్కరించాలని అదనపు కలెక్టర్ లింగ్యా నాయక్ తెలిపారు. ప్రతి సోమవారం కలెక్టరేట్ కార్యాలయంలో నిర్వహించే ప్రజావాణికి జిల్లా అధికారులందరూ తప్పనిసరిగా హాజరు కావాలని జిల్లా అదనపు కలెక్టర్ లింగ్యా నాయక్ తెలిపారు. ఈ ప్రజావాణిలో వివిధ శాఖల జిల్లా అధికారులు పాల్గొన్నారు.

## ఏ. ఎస్.డీ.ఎస్ సంస్థ ఆధ్వర్యంలో ‘పదిహేను వందల విలువగల కిట్స్ పంపిణీ”

**- సుమారు 1500 రూపాయలు విలువ చేసేటటువంటి కిట్స్ పంపిణీ.**

**- ఏ. ఎస్.డీ.ఎస్ సంస్థ వారి ఆధ్వర్యంలో గూంజు వారి సహకారంతో 172 వరద బాధిత కుటుంబాలకు పంపిణీ.**

**- పేద ప్రజల కోసం అహర్నిశలు కృషి చేస్తా వి.గాంధీ బాబు.**



వి.ఆర్.పురం, **ఆగస్టు 05 జనం రిపోర్టర్ :**ఆపదలో ఉన్న ప్రజలకు అండగా ఉండడమే లక్ష్యంగా ఏ.ఎస్.డి.ఎస్ సంస్థ ఎన్నో దశాబ్దాల కాలంగా పేద ప్రజల కోసం అహర్నిశలు కృషి చేస్తుందని మండల జడ్పిటిసి వాళ్ళ రంగారెడ్డి, మండల అధికారులు అన్నారు. సోమవారం మండల పరిధిలోని దర్మాతల గూడెం గ్రామంలో వరద బాధితులకు ఎస్.ఎస్.డి.ఎస్ సంస్థ ఆధ్వర్యంలో గూంజు వారి సహకారంతో సుమారు 1500 రూపాయలు విలువ చేసేటటువంటి టార్పాలిన్,బెడ్ షీట్,తవల్స్,రోప్స్,మేట్స్ తదితర కిట్స్ ని సుమారు 172 కుటుంబాలకి పంపిణీ చేయడం జరిగింది. ఈ సందర్భంగా గాంధీ బాబు మాట్లాడుతూ గోదావరి వరదలను ప్రజలు అనేక ఇబ్బందులకు పడ్డారని ప్రతి సంవత్సరం వరద బాధితులకు సంస్థ తరపున సహాయ సహకారాలు ఎల్లవేళలా అందిస్తూనే ఉన్నామని తెలిపారు. ఎస్ డి ఎస్ సంస్థ ప్రజలకు ఎప్పుడు సేవ చేసేందుకు అందుబాటులో ఉంటుందని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో మండల స్థానిక ఎమ్మార్వో సయ్యద్ పజిల్ ,ఎంపీడీవో ఫణీంద్ర, జడ్పిటిసి వాళ్ళ రంగారెడ్డి, స్థానిక సర్పంచ్ సోడి నర్సమ్మ,గూంజు కోఆర్డినేటర్ తిరుపతిరావు, గ్రామ పెద్దలు తదితరులు పాల్గొన్నారు.

# పోలీస్ పెట్రో కార్, హైవే పెట్రోలింగ్ పోలీసు వాహనాలను తనిఖీ చేసిన అడిషనల్ డీసీపీ అడ్మిన్....

రామగుండం **ఆగస్టు 05 జనం రిపోర్టర్ :** పెట్రోల్ కార్ నిరంతరం 24%ఇ%7 గస్తీ నిర్వహింస్తూ, ప్రజలకు ఎల్లపుడు అందుబాటులో వుంటూ, ప్రజా ఫిర్యాదులలో ఎటువంటి జాప్యం చేయకుండా తక్షణమే స్పందించి ,డయల్ 100 కాల్ రాగానే వెంటనే సంఘటనా స్థలానికి చేరుకుని సమస్య పరిష్కరించి , ప్రజల సమస్యలను చట్టపరిదిలో తీర్చాలని ఉద్దేశ్యం తో ప్రతి పోలీస్ స్టేషన్ పరిధిలో విసేబుల్ పోలిసింగ్, ప్రోఆక్టివ్ పోలీసింగ్ కోసం బ్లూకోల్ట్స్, పెట్రోల్ కార్ సిబ్బంది స్కూల్స్, కాలేజీలు, బస్టాండ్, రద్దీ ప్రాంతాల్లో, విసబుల్ పోలీసింగ్,హై వె పెట్రోలింగ్ సిబ్బంది ట్రాఫిక్ అంతరాయం కలగకుండా ,ఏదైనా ప్రమాదం జరిగినప్పుడు బాదితులకు తక్షణ సహాయం అందించడం కోసం పెట్రోలింగ్ నిర్వహిస్తూ, ప్రజలకు సమర్ధవంతమైన సేవలు అందించడం కోసం సోమవారం పెట్రో కార్





,హై వే పెట్రోలింగ్ వాహనాలను రామగుండం పోలీస్ కమిషనర్ ఎం.శ్రీనివాస్ ఆదేశాల మేరకు రామగుండం పోలీస్ కమీషనరేట్ పెద్దపల్లి, మంచిర్యాల పరిధిలోని పెట్రో కార్, రక్షక్ , హైవే పెట్రోలింగ్ పోలీసు వాహనాల పనితీరు వాటి నిర్వహణను అడిషనల్ డీసీపీ అడ్మిన్ సి.రాజు ఎం,టి.ఓ లు, ఐటీ కోర్, కమ్యూనికేషన్ ఇన్స్పెక్టర్లతో కలిసి కమీషనరెట్ హెడ్ క్వార్టర్స్ లో పరిశీలించారు. వాహనల పనితీరు, నిర్వహణ, ట్యాబ్స్ పనితీరు, చాలా ఎక్కువ ఫ్రీక్వెన్సీ, సెట్ పనితీరు, విశ్వంలో ప్రస్తుతం మనమున్న స్థానాన్ని తెలుసుకునే వ్యవస్థ పనితీరు, టూల్ కిట్స్ తనిఖీ చేసి వారు నిర్వహిస్తున్న విధుల గురించి డ్రైవర్స్ ని అడ్మిన్ అడిగి తెలుసుకోవడం జరిగింది. ఈ సందర్భంగా అడిషనల్ డిసీపీ అడ్మిన్ మాట్లాడుతూ. రామగుండం పోలీస్ కమిషనరేట్ పరిధి పెద్దపల్లి, మంచిర్యాల జోన్ లలోని పోలీస్ స్టేషన్ ల పరిధిలో గల పోలీస్ వాహనాలు నిరంతరంగా వివిధ ప్రజాసేవలకు, ఎలాంటి ఆటంకం కలగకుండా సాఫీగా ప్రజా సేవలు కొనసాగిస్తున్నాయని తెలిపారు. వాహనాల నిర్వహణ లోటుపాట్లపై నిరంతరం పర్యవేక్షిస్తూ ఉండాలని క్షుణ్ణంగా తనిఖీలు చేపట్టి సమగ్ర నివేదికను నెలవారీగా సమర్పించాలని మోటార్ వాహనాల అధికారులకు, ఇతర అధికారులకు తెలియజేశారు. వాహనాలపై ప్రత్యేక శ్రద్ధ వహించలని మంచి కండిషన్లో ఉంచుకోవాలని వాహన డ్రైవర్లకు ఆదేశించినారు. విధులలో ఉన్నపుడు పోలీసు యునిఫామ్ తప్పని సరిగ ధరించాలి. డ్రైవింగ్ సమయంలో ఎల్లప్పుడూ సీట్ బెల్ట్ ధరించండి.ఎట్టి పరిస్థితులలో మద్యం సేవించి డ్రైవ్ చేయవద్దు. మొబైల్ ఫోన్ ఉపయోగించవద్దు. వాహనాన్ని ప్రభుత్వ విధులకు మాత్రమే వినియోగించాలి. పోలీసు వాహనాలను సక్రమంగా ఉండేలా చర్యలు తీసుకోవాలని సొంత వాహనంలా మంచి కండిషన్లో ఉంచి ఎప్పటికప్పుడు సర్వీసింగ్, ఇంజన్ ఆయిల్, టైర్ల నిర్వహణ, టైర్లు, అద్దాలు, ఇంజిన్, మైక్, లూబ్రికెంట్లు, బ్రేకులు, విశ్వంలో ప్రస్తుతం మనమున్న స్థానాన్ని తెలుసుకునే వ్యవస్థ వ్యవస్థను నిరంతరం తనిఖీ చేయాలి, పెట్రో కార్ వాహనంలలో ఫస్ట్ ఎయిడ్ కిట్, డ్రాగన్ లైట్, రోప్స్, కోన్స్, క్రైమ్ ప్రొటాక్ట్ రిబ్బన్, రైట్ గేర్ కిట్( హెల్మెట్, స్టోన్ గార్డ్, లాఠీ, బాడీ ప్రొటెక్టర్) లు తప్పనిసరిగా ఉండాలని సూచించడం జరిగింది. పెట్రోల్ వెహికల్, హైవే పెట్రోలింగ్ వెహికల్ మూమెంట్ ని ఐటీ కోర్ టీమ్ పాలీమెరేస్ చ్కెన్ రియాక్షన్ టీమ్ ఎప్పుడు గమనిస్తూ ఉంటాయని తెలిపారు. విధుల్లో అలసత్వం ప్రదర్శించినట్లయితే శాఖ పరమైన కఠిన చర్యలు తీసుకోవడం జరుగుతుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో స్పెషల్ బ్రాంచ్ ఏసిపి రాఘవేంద్రరావు, ఏ ఆర్ ఏసీపీ సురేంద్ర, ఐటీ కోర్ ఇన్స్పెక్టర్ ప్రమోదరావు, పి సి ఆర్ ఇన్స్పెక్టర్ రవీందర్, శ్రీధర్, ఐటి %డ% సి ఇన్స్పెక్టర్ రాంప్రసాద్, పెద్దపల్లి జోన్ ఎంటిఓ కన్న మధు, బెల్లంపల్లి ఎంటిఓ సంపత్, ఆర్ఐలు దామోదర్, శ్రీనివాస్,ఎస్ఐ రాణి, వినోద్, ఐటి కోర్ హెడ్ కాన్స్టేబుల్ రాము, పాల్గొన్నారు.

## “హలో మాల.... చలో ఢిల్లీ”....

-ఎస్ సి వర్గీకరణ తీర్పు బీజేపీ కుట్ర...

-మాల మహానాడు ఆఫ్ ఇండియా జాతీయ అధ్యక్షులు డా పసుల రాంమూర్తి...



రామగుండం **ఆగస్టు 05 జనం రిపోర్టర్ :**మాల మహానాడు ఆఫ్ ఇండియా ఆధ్వర్యంలో ఎస్సీ వర్గీకరణకు వ్యతిరేకంగా రాష్ట్ర కార్యదర్శి గంట బబిత అధ్యక్షతన గోదావరి ఖని పట్టణం లోని అధిత్య హొటల్ లో సమావేశం జరిగింది. ఈ సమావేశం లో ముఖ్య అతిదిగా జాతీయ అధ్యక్షులు డా పసుల రాంమూర్తి హాజరు అయి మాట్లాడుతు. సుప్రీంకోర్టు ఎస్సీ వర్గీకరణ పై ఇచ్చిన తీర్పును మాల మహానాడు ఆఫ్ ఇండియా తీవ్రంగా వ్యతిరేకిస్తుంది అని అన్నారు “హలో మాల చలో ఢిల్లీ “ఆగస్టు 11 12 తేదీలలో జంతర్ మంతర్ లో బిజెపి ప్రభుత్వానికి వ్యతిరేకంగా ,ఆందోళన చేయడానికి వేలాదిమంది కదలి రావాలని మాల మాల ఉపకులాలకు అంబేద్కర్ వాదులకు డాక్టర్ పసుల రామ్మూర్తి పిలుపునిచ్చారు.ఎస్సీ వర్గీకరణ సుప్రీంకోర్టు ఇచ్చిన తీర్పుపై 9 మంది జడ్జిలచే అప్పీలు కు వెళతామని అన్నారు. ఏడుగురు జడ్జీలతోని ఇచ్చిన తీర్పును 341 ఆర్టికల్ ను మర్చిపోవడం భావ్యం కాదన్నారు. క్రిమిలేయర్ పద్ధతి ఎస్సీ వర్గీకరణలో చూపించడం మన వాదానికి, రిజర్వేషన్ రద్దుకు అనుకూలంగా ఉందని మండిపడ్డారు. ఈ కార్యక్రమంలో జాతీయ యువజన విభాగం ప్రధాన కార్యదర్శి మగ్గిడి దీపక్ కుమార్, రాష్ట్ర మహిళా ఉపాధ్యక్షురాలు ఆరే దేవకర్ణ, సీనియర్ నాయకులు ఏరుకల లక్ష్మణరావు, రామగుండం నియోజకవర్గం అధ్యక్షుడు గాదం శ్రీనివాస్ పాల్గొన్నారు.

## నాగారం గ్రామంలో స్వచ్ఛతనం పచ్ఛదనం కార్యక్రమం తంగెళ్లపల్లి తిరుపతి



హసన్ పర్తి మండలం **ఆగస్టు 05 జనం రిపోర్టర్ :** హసన్ పర్తి మండలం లోని నాగారం గ్రామంలో ఈరోజు స్వచ్ఛ దానం పచ్చదనం అనే కార్యక్రమాని వర్ధన్నపేట శాసనసభ్యులు విశ్రాంత ఐపిఎస్ ఎమ్మెల్యే కే ఆర్ నాగరాజు ఆదేశాల మేరకు నాగారం గ్రామంలో స్వచ్ఛ ధనం -పచ్చదనం అనే కార్యక్రమాన్ని కాంగ్రెస్ పార్టీ బ్లాక్ అధ్యక్షుడు తంగెళ్లపల్లి తిరుపతి,మండల అధ్యక్షుడు పోరెడ్డి మహేందర్ రెడ్డి గ్రామపంచాయతీ సిబ్బందితో కలిసి ప్రారంభించడం జరిగింది అనంతరం వారు మాట్లాడుతూ గ్రామంలో ప్రతి వార్డ్ ప్రతి ఏరియా పరిసరాల పరిశుభ్రత కోసం కలిసి తిరుగుతూ ప్రజలకు అవగాహన కల్పిస్తూ స్వచ్చతనం పచ్చదనం కార్యక్రమాన్ని గురించి ప్రజలకు అవగాహన పరుస్తూ గ్రామంలో ర్యాలీగా తిరగడం జరిగింది ఈ కార్యక్రమాన్ని తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం అన్ని గ్రామాలలో ప్రతిష్టాత్మకంగా చేపడుతూ స్వచ్ఛదనం పచ్చదనం అనే కార్యక్రమాన్ని 05/08/2024 - 09/08/2024 నుండి హసన్ పర్తి మండల ప్రతి గ్రామంలో నిర్వహిస్తారు కావున కాంగ్రెస్ కార్యకర్తలు గ్రామపంచాయ సిబ్బంది ప్రతి ఒక్కరు ఈ కార్యక్రమాన్ని విజయవంతం చేయవలసిందిగా పిలుపునివ్వడం జరిగింది ఈ కార్యక్రమం లో హసన్ పర్తి కాంగ్రెస్ పార్టీ మహిళా మండల అధ్యక్షురాలు జోరుకపూల, మండల బీసీ సెల్ నక్కరవి.మండల మైనారిటీ అన్వర్. కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు సర్పంచ్ కాంటెస్ట్ అభ్యర్థి చందరాజు,సంతోష్. గ్రామ యూత్ ప్రెసిడెంట్ సునీల్, గ్రామపంచాయతీ సిబ్బంది. అంగన్వాడీ టీచర్లు, ఆశా వర్కర్లు. తదితరులు పాల్గొన్నారు

## తల్లిపాలు బిడ్డకు అమృతం తల్లిపాలు ముద్దు డబ్బా పాలు వద్దు



రేపల్లె **ఆగస్టు 05 జనం రిపోర్టర్ :** తల్లిపాలు బిడ్డకు మొదటి టీ కానీ తల్లిపాలే బిడ్డకు రోగనిరోధక శక్తి పెంపొందిస్తుందని ఐసిడిఎస్ సూపర్వైజర్ మణికుమారి అన్నారు సోమవారం మండలంలోని బేతపూడి బీసీ అంగన్వాడీ కేంద్రంలో తల్లిపాలభారత్వాల భాగంగా సమావేశం నిర్వహించారు గ్రామంలో తల్లిపాలు వారోత్సవాలపై అవగాహన కలిగించేందుకు ర్యాలీ నిర్వహించారు అనంతరం ఏర్పాటు చేసిన సమావేశంలో ఆరోగ్య శాఖ అధికారి వై సుభాష్ న్ మాట్లాడుతూ పుట్టినరోజు అవే బిడ్డకు ఆరోగ్యమని తెలియజేశారు ప్రతి తల్లి బిడ్డ పుట్టిన తాగించాలని ఆయన చూపించారు ముర్రు పాలలో బిడ్డకు జీవితాంతం ఉపయోగపడే రోగనిరోధక శక్తి ఉంటుందని తెలియజేశారు ఈ కార్యక్రమంలో అంగన్వాడీ సూపర్వైజర్ పి వెంకటరత్నమ్మ కార్యకర్తలు వై కనకదుర్గ జి నాగమల్లేశ్వరి ఈ శాంతకుమారి పాల్గొన్నారు అలాగే మండలంలోని విరాట లంక అంగన్వాడీ కేంద్రంలో ఐసిడిఎస్ సూపర్వైజర్ సిహెచ్ రజిని అడవిపాలు అంగన్వాడీ కేంద్రంలో ఐసిడిఎస్ సూపర్వైజర్ పి నాంచారమ్మ ఆధ్వర్యంలో తల్లిపాల వారోత్సవాలు నిర్వహించారు

## “స్వచ్ఛదనం...పచ్చదనం” మానవ మనుగడకు పర్యావరణమే కీలకం...

### బికార్పోరేటర్ ముస్తఫా...



రామగుండం **ఆగస్టు 05 జనం రిపోర్టర్ :**స్వచ్ఛదనం... పచ్చదనం కార్యక్రమంలో భాగంగా సోమవారం స్థానిక 44వ. డివిజన్ కార్పోరేటర్ ఎండీ ముస్తఫా ఆధ్వర్యంలో రమేశ్ నగర్ నుండి తిలక్ నగర్ వెళ్ళే మార్గం లో రోడ్డుకు ఇరువైపులా ఉన్న చెత్త, చెదరాలను, నిలిచి ఉన్న నీటిని మున్సిపల్ పరిశుద్ధ సిబ్బంది తో శుభ్రం చేయించడం జరిగినది. ఈ సందర్భంగా ముస్తఫా మాట్లాడుతూ. చెత్తను తొలగించి మొక్కలు నాటాలని అన్నారు. ఈ వన మహొత్సవం ద్వారా ఖాళీ స్థలంలో మొక్కలు నాటాలన్నారు. మానవ మనుగడకు పర్యావరణమే కీలకమని, పర్యావరణాన్ని కాపాడు కోవడానికి “స్వచ్ఛదానం పచ్చదనం” దోహద పడుతుందని కార్పోరేటర్ ముస్తఫా అన్నారు.



కార్యక్రమం లో కాంగ్రెస్ పార్టీ సోషల్ మీడియా కో ఆర్డినేటర్ దులీకట్ట సతీష్, పీక అరుణ్, బబ్బి అవినాష్, సిరిపురం మహేష్ తదితరులు పాల్గొన్నారు.

## తెలంగాణ ప్రభుత్వము ఉపాధి మరియు శిక్షణా శాఖ.. జాబ్ మేళా..!!

-భారత్ ఫైనాన్సియల్ ఇంక్లూషన్ లిమిటెడ్ నందు జాబ్స్ కొరకు..!!

-జిల్లా ఉపాధి కల్పన అధికారి షేక్ అబ్దుల్ సుభాన్..!!



వికారాబాద్ జిల్లా **ఆగస్టు 05 జనం రిపోర్టర్ :** తెలంగాణ ప్రభుత్వము వారు , జిల్లా ఎంప్లాయిమెంట్ కార్యాల యము వికారాబాదు నందు తేదీ 07-08-2024 బుధవారం నాడు ఉదయము 10:30గం లకు “ జాబ్ మేళా “ ను నిర్వహిస్తున్నారు. వేదిక : జిల్లా ఎంప్లాయిమెంట్ కార్యాలయము ప్రభుత్వ ఐ.టి.ఐ. క్యాంపస్,శుభాష్ నగర్ కాలనీ, వికారాబాదు, వికారాబాదు జిల్లా. ఉద్యోగాల సంఖ్య : సుమారు 100 (అబ్బాయిలు మాత్రమే) రంగము: భారత్ ఫైనాన్సియల్ ఇంక్లూషన్ లిమిటెడ్ అర్హత : ఇంటర్మీడియట్ అండ్ అబో ఉద్యోగం : ఫీల్డ్ అసిస్టెంట్ వయస్సు : 18-28 ఉద్యోగ స్థలం : తెలంగాణ ప్రఖ్యాత ప్రైవేటు పరిశ్రమల యజమాన్యము వారు తమ పరిశ్రమలకు అవసరమగు సిబందిని ఈ జాబ్ మేళ ద్వారా ఎన్నుకొందురు. ఇతర వివరములకు జాబ్ మేళా నిర్వాహకుడు శ్రీ మియా సాబ్ 9676047444 నందు సంప్రదించవచ్చును. అభ్యర్థులు అధిక సంఖ్యలో పాల్గొని తగిన ఉద్యోగము పొందగలరని తెలిపారు.

## కృష్ణానదికి వరద వచ్చే ప్రమాదం



రేపల్లె **ఆగస్టు 05 జనం రిపోర్టర్ :** కృష్ణానదికి త్వరగా వచ్చే ప్రమాదం ఉందని అధికారులు అందరూ అప్రమత్తంగా ఉండాలని ఆర్డిఓ హేలా షారోన్ అన్నారు సోమవారం స్థానిక ఆర్డిఓ కార్యాలయంలో వివిధ శాఖల అధికారులతో ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు వరదలపై సమావేశం నిర్వహించారు ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ శ్రీశైలం , నాగార్జునసాగర్ పులిచింతల ప్రాజెక్టుల నుండి ప్రకాశం బ్యారేజ్ కి వరద పోటీతో ఉందని దీంతో అధికారులు వరద నీటిని సముద్రంలోకి వదిలెందుకు సిద్ధమయ్యారని దీనివల్ల లోతట్టు ప్రాంత ప్రజలు అప్రమత్తంగా ఉండాలని ఆమె సూచించారు ముందు జాగ్రత్తగా లోతట్టు ప్రాంత ప్రజలను సురక్షిత ప్రాంతాలకు తరలించాలన్నారు ఎటువంటి ప్రాణా నష్టం కానీ ఆస్తి నష్టం కానీ జరగకుండా ముందు జాగ్రత్త చర్యలు తీసుకోవాలన్నారు మండల స్థాయి అధికారులు అందరూ అందుబాటులో ఉండాలన్నారు ఏ ఒక్క అధికారి గాని అనధికారులు కానీ సెలవులు తీసుకోవద్దని సెలవుల్లో ఉన్న వారు విధులకు హాజరు కావాలని సూచించారు ఈ కార్యక్రమంలో వివిధ శాఖల మండల స్థాయి అధికారులు పాల్గొన్నారు

## ఆర్థిక సహాయం అందజేత.

**ఆగస్టు 05 జనం రిపోర్టర్ :** నిజాంపట్నం పంచాయతీ గోకర్ణ మఠం గ్రామానికి చెందిన టిడిపి సీనియర్ కార్యకర్త కొక్కిలిగడ్డ వెంకటేశ్వరరావు అనారోగ్యా కారణంగా మృతి చెందాడు ఆయన మృతి పట్ల రాష్ట్ర రెవెన్యూ శాఖ మంత్రి అనగాని సత్యప్రసాద్ సంతాపం తెలిపారు. మంత్రి ఆదేశాల మేరకు సోమవారం నిజాంపట్నం టిడిపి సీనియర్ నాయకుడు బొమ్మిడి రామకృష్ణ గోకర్ణ మఠం లో మృతి దేహాన్ని సందర్శించి కుటుంబ సభ్యులను పరామర్శించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పార్టీలో ఉండి కష్టపడి పని చేసిన ప్రతి కార్యకర్తకు వారి కుటుంబాలకు పార్టీ మరియు మంత్రి అనగాని అండగా ఉంటారని భరోసా ఇచ్చారు. ఈ సందర్భంగా కుటుంబ సభ్యులకు 10,000 ఆర్థిక సహాయం అందించారు. ఈ కార్యక్రమంలో టిడిపి నాయకులు నాయుడు నరసింహ మూర్తి మూర్తి, ఖాదర్ బాబు, ఇమ్రాన్ ఖాన్, శీలం కోటేశ్వరావు, కార్యకర్తలు ఉన్నారు.

# తల్లిపాలే బిడ్డకు శ్రేయస్కరం



వి.ఆర్.పురం, ఆగస్టు 05 జనం రిపోర్టర్ : తల్లిపాలు బిడ్డకు మొదటి టీ కానీ తల్లిపాలే బిడ్డకు రోగనిరోధక శక్తి పెంపొందిస్తుందని ఐసిడిఎస్ సిడిపివో పి.నగా లక్ష్మీ అన్నారు సోమవారం మండలంలోని చినమట్టపల్లి అంగన్వాడీ కేంద్రంలో తల్లిపాలభారత్సాల



భాగంగా సమావేశం నిర్వహించారు గ్రామంలో తల్లిపాలు వారోత్సవాలపై అవగాహన కలిగించేందుకు ర్యాలీ నిర్వహించారు అనంతరం ఏర్పాటు చేసిన సమావేశంలో ఆరోగ్య శాఖ అధికారి జన కళ్యాణ వేల పేరు సొసైటీ స్వచ్ఛంద సంస్థ ప్రాజెక్ట్ డైరెక్టర్ నాగేశ్వరరావు మాట్లాడుతూ పుట్టినరోజు అవే బిడ్డకు ఆరోగ్యమని తెలియజేశారు ప్రతి తల్లి బిడ్డ పుట్టిన తాగించాలని ఆయన చూపించారు మ్రు పాలలో బిడ్డకు జీవితాంతం ఉపయోగపడే రోగనిరోధక శక్తి ఉంటుందని తెలియజేశారు ఈ కార్యక్రమంలో అంగన్వాడీ సూపర్వైజర్ , ఏయన్ యం లు , హెల్త్ సిబ్బంది. పాల్గొన్నారు

# ఐదేళ్ల వైసీపీ పాలన లో ఉన్న నీటిని కూడా రైతులు ఉపయోగిం చుకోలేని దుస్థితి



ఎత్తిపోతల పథకాలను నిర్వీర్యం చేశారు రాష్ట్రాన్ని పునరుజ్జీవింపజేసే దిశగా కూటమి సర్కారు శరవేగంగా అడుగులు వేస్తోంది ఎమ్మెల్యే తంగిరాల సౌమ్య ఆగస్టు 05 జనం రిపోర్టర్ : ఎన్టీఆర్ జిల్లా, నందిగామ,ఆగస్టు 5 :రాష్ట్రాన్ని పునరుజ్జీవింపజేసే దిశగా కూటమి సర్కారు శరవేగంగా అడుగులు వేస్తోందని నందిగామ ఎమ్మెల్యే తంగిరాల సౌమ్య అన్నారు. విభజన గాయాల నుంచి కోలుకునే దశలో మాజీ సీఎం జగన్ చేసిన విధ్వంసం నుంచి బయటపడడానికి కూటమి ప్రభుత్వం సీఎం చంద్రబాబు నాయుడు సర్వశక్తులూ ఒడ్డుతున్నారని పేర్కొన్నారు. సోమవారం కంచికచర్ల మండలం గండేపల్లిలో కీసర ఎత్తిపోతల పథకం పనులను ప్రారంభించారు. స్థానిక సెంతిని సంస్థ వారు స్వచ్ఛందంగా ముందుకు వచ్చి ఎత్తిపోతల పథకం మరమ్మతు పనులకు 25 లక్షల రూపాయలను అందించడం అభినందనీయమని అన్నారు. అంతేకాకుండా కేసర నుండి గండేపల్లి వరకు ఉన్న రోడ్డుని అభివృద్ధి చేయట కొరకు ముందుకొచ్చిన సెంటిని యాజమాన్యాన్ని ప్రత్యేకంగా అభినందన అభినందిస్తున్నట్లు అదేవిధంగా ప్రభుత్వం నుండి తప్పనిసరిగా సహకారం కంపెనీకి కూడా ఉంటుందని పేర్కొన్నారు. గతంలో స్కీం అభివృద్ధికి రైతు నాయకులు మందడపు పేరయ్య , రైతులు తోడ్పడ్డారని ఈ సందర్భంగా గుర్తు చేశారు. గత పాలకులు కనీస పనులు కూడా చేయకుండా మోటార్లను ధ్వంసం చేసి ఎత్తిపోతల పథకాలను భ్రష్టు పట్టించారని ఈ సందర్భంగా వైసీపీ నేతలపై ఆగ్రహం వ్యక్తం చేశారు. ఈ నిర్లక్ష్యానికి కారణం నాటి వైఎస్ జగనేనని ఎమ్మెల్యే తంగిరాల సౌమ్య మండిపడ్డారు. ఇది ఏమైనా కూటమి ప్రభుత్వం మంత్రి చంద్రబాబు నాయుడు మళ్లీ ఏపీకి పూర్వవైభవాన్ని తీసుకువచ్చేలా పనులను పరుగులు పెట్టిస్తున్నారని రైతుల హర్షద్వానాల మధ్య మధ్య సౌమ్య వ్యక్తం చేశారు. అధికారులు, కూటమి నాయకులు, రైతులు పెద్ద ఎత్తున పాల్గొన్నారు.

# నందిగామ మండల తాహసిల్దార్ గా బాధ్యతలు స్వీకరించిన ఎన్ సురేష్ బాబు.




ఎన్టీఆర్ జిల్లా, నందిగామఆగస్టు 05 జనం రిపోర్టర్ : తహసిల్దార్ సురేష్ బాబు మాట్లాడుతూ మండలంలో ప్రజలకు నిత్యం అందుబాటులో ఉంటానని రైతులకు ప్రజలకు ఎటువంటి సమస్యలు ఉన్న నేరుగా వచ్చి నన్ను కలవచ్చని రైతులుకి ఎటువంటి సమస్య ఉన్న వెంటనే పరిష్కరిస్తానని ప్రజలకు రెవిన్యూ కార్యాలయంలో ఎటువంటి పని ఉన్న వెంటనే పరిష్కారం చేసే దిశగా పనిచేస్తానని ఈ సందర్భంగా అన్నారు.అనంతరం కార్యాలయాన్ని పరిశీలించిన తహసీల్దార్.రెవెన్యూ అధికారులు డిప్యూటీ తహసీల్దార్ రిబ్బికా రాణి,సీనియర్ అసిస్టెంట్ సంధ్య,ఆర్ఐ వేణు కుమారి జూనియర్ అసిస్టెంట్ తహసీల్దార్ ను మర్యాదపూర్వకంగా కలిసి పుష్పగుచ్చం అందజేశారు.వీఆర్వోల ఆర్గనైజింగ్ సెక్రటరీ వెలగ శ్రీనివాసరావు డివిజన్ ప్రెసిడెంట్ కన్నెగంటి లీల ప్రసాద్ మండల అధ్యక్షులు కొల్లి నరేష్ మరియు విఆర్వోలు అందరూ తాసిల్దారును మర్యాదగాపూర్వకంగా కలిసి పుష్పగుచ్చం అందజేశారు

## త్రాగునీరు కలుషితం కాకుండా చర్యలు చేపట్టాలి

## : వికారాబాద్ మున్సిపల్ చైర్ పర్సన్ చిగుళ్లపల్లి మంజుల రమేష్



వికారాబాద్ జిల్లా ఆగస్టు 05 జనం రిపోర్టర్ : వికారాబాద్ మున్సిపల్ పరిధిలోని 30వ వార్డు ఇందిరానగర్ లో యుజిడి సమస్యతో త్రాగునీరు కలుషితం అవుతుందని స్థానిక కౌన్సిలర్ బొండాల సువర్ణ, చైర్ పర్సన్ మంజుల రమేష్ దృష్టికి తీసుకురావడంతో ఈరోజు చైర్ పర్సన్ ఇంద్రానగర్ లో పర్యటించి సమస్యను పరిశీలించారు. ఈ సందర్భంగా పట్టణంలో యుజిడి లీకేజీలు, త్రాగునీరు కలుషితం కాకుండా తగు జాగ్రత్తలు తీసుకోవాలని చైర్ పర్సన్ మున్సిపల్ అధికారులకు స్పష్టమైన ఆదేశాలు ఇచ్చారు. ఇట్టి సమస్యను వెంటనే పరిష్కరించేలా చర్యలు తీసుకోవాలని మున్సిపల్ కమిషనర్ జాకీర్ అహ్మద్ కు సూచించారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ జాకీర్ అహ్మద్, వికారాబాద్ మున్సిపల్ మాజీ వైస్ చైర్మన్ చిగులపల్లి రమేష్ కుమార్, మెప్మా వెంకటేష్, నాయకులు బోండాల శ్రీనివాస్, రంగరాజ్, వసంత్, మున్సిపల్ సిబ్బంది నాగేందర్, యాదయ్య, జవాన్ రాజు, రాఘవేందర్, ఆర్పి స్వరూప తదితరులు పాల్గొన్నారు.

# బాధిత కుటుంబానికి నిత్యావసర వస్తువుల అందజేత....

## –ఆపదలో ఉన్న వారికి ఆపన్న హస్తం, కష్టాల్లో ఉన్నవారికి ఆర్థిక చేయూత, ప్రజా సేవే నా ప్రథమ కర్తవ్యం....

## –మానవత్వాన్ని చాటుకుంటున్న గాదె సుధాకర్...



రామగుండం ఆగస్టు 05 జనం రిపోర్టర్ : సోమవారం అంతర్గాం మండలంలోని ఆకెనపల్లి గ్రామంలో కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకుడు, నియోజకవర్గ సోషల్ మీడియా కోఆర్డినేటర్ గాదే సుధాకర్ స్వర్గీయ ఉప్పులేటి జోగు పోచయ్య ఇటీవల అనారోగ్యంతో పరమపదించిన సందర్భంగా,సోమవారం వారి దశదినకర్మ కార్యక్రమానికి వారి కుటుంబ సభ్యులకు, 25 కేజీ రైస్ బ్యాగు తోపాటు సంబంధిత వస్తువులను అందజేయడం జరిగినది. అనంతరం సుధాకర్ మాట్లాడుతూ. గతంలో ఆకెనపల్లి గ్రామంలో ఇంటి పెద్దదిక్కును కోల్పోయిన పలు కుటుంబాలకు ఆర్థిక సహాయం అందించానని, ఎవరికైనా ఆపద వస్తే తప్పకుండా నా వంతు సహాయ సహకారాలు అందిస్తానని, బాధ్యత గల వ్యక్తిగా అకెనపల్లి గ్రామంలో ఏ కుటుంబానికి సమస్య వచ్చినా అండగా ఉంటానని, "ప్రజా సేవే నా ప్రథమ కర్తవ్యం" అని ఈ సందర్భంగా మాట్లాడడం జరిగినది. ఈ కార్యక్రమంలో జోగు పోచయ్య కుటుంబ సభ్యులతో పాటు పలువురు ప్రముఖులు, మ్రి రాజ్ కుమార్,గెల్లు కుమార్,అడ్లూరి రాజయ్య, ఉప్పులేటి శంకర్, ఉప్పులేటి రాజేందర్, మెండే శ్రీను, ఆకుల రాము,ఉప్పులేటి రాకేష్, ఉప్పులేటి సాయి, ఉప్పులేటి ప్రియాంక్ తదితరులు పాల్గొన్నారు.

# రోడ్డుప్రమాదంలో గాయపడ్డ సుంకవిల్లి వీర వెంకట సత్యనారాయణ (యల్లమిల్లి సీఎం)ను పరామర్శించిన ఎమ్మెల్యే జ్యోతుల నెహ్రూ





కాకినాడ జిల్లా ,జగ్గంపేట , ఆగస్టు 05 జనం రిపోర్టర్ : జగ్గంపేటలో ఎన్టీఆర్ విగ్రహం వద్ద జరిగిన అన్న క్యాంటీన్ కార్యక్రమంలో పాల్గొని తన స్వగ్రామం గండేపల్లి మండలం యల్లమిల్లి గ్రామానికి బయలుదేరిన తెలుగుదేశం పార్టీ సీనియర్ నాయకులు సుంకవిల్లి వీర వెంకట సత్యనారాయణ (యల్లమిల్లి సీఎం) మార్గమధ్యలో రోడ్డు ప్రమాదంలో గాయపడ్డారు. హుటాహుటిన జగ్గంపేట సాయి హాస్పిటల్ కు తరలించారు .కుడివైపు తుంటి భాగం విరిగిపోవడంతో జగ్గంపేట శాసనసభ్యులు జ్యోతుల నెహ్రూ సాయి హాస్పిటల్ కి వెళ్లి యల్లమిల్లి సీఎం ను పరామర్శించి మెరుగైన వైద్యం అందించాలని డాక్టర్లను ఆదేశించారు. రేపు ఉదయం శస్త్ర చికిత్స చేస్తామని డాక్టర్లు తెలియజేశారు. మారిశెట్టి భద్రం, ముంద్రు ఎర్రబాబు, మండపాక అప్పన్నదొర, మాదిరెడ్డి కృష్ణార్జున,మద్దిపూడి వీర వెంకట సత్యనారాయణ, దేవిశెట్టి బాబ్జి, సుంకవిల్లి సాయిబాబా, పాక అప్పలరాజు తదితరులు పాల్గొన్నారు.

# చందర్లపాడు మండల తాహసిల్దార్ గా బాధ్యతలు స్వీకరించిన పాల్.



ఎన్టీఆర్ జిల్లా, చందర్లపాడు, ఆగస్టు 05 జనం రిపోర్టర్ : తహసిల్దార్ పాల్ మాట్లాడుతూ మండలంలో ప్రజలకు నిత్యం అందుబాటులో ఉంటానని రైతులకు ప్రజలకు ఎటువంటి సమస్యలు ఉన్న నేరుగా వచ్చి నన్ను కలవచ్చని రైతులుకి ఎటువంటి సమస్య ఉన్న వెంటనే పరిష్కరిస్తానని ప్రజలకు రెవిన్యూ కార్యాలయంలో ఎటువంటి పని ఉన్న వెంటనే పరిష్కారం చేసే దిశగా పనిచేస్తానని ఈ సందర్భంగా అన్నారు.

## స్వచ్ఛదనం పచ్చదనం అవగాహన ర్యాలీలో పాల్గొన్న వికారాబాద్ మున్సిపల్ చైర్ పర్సన్ చిగుళ్లపల్లి మంజుల రమేష్..!!






వికారాబాద్ జిల్లా ఆగస్టు 05 జనం రిపోర్టర్ : తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం ఆదేశాల మేరకు స్వచ్ఛదనం పచ్చదనం కార్యక్రమంలో భాగంగా ఈరోజు వికారాబాద్ మున్సిపల్ పరిధిలోని 25వ వార్డు, చైర్ పర్సన్ సొంత వార్డులో స్వచ్ఛదనం పచ్చదనం కార్యక్రమాన్ని ర్యాలీతో ప్రారంభించారు. ఈ ర్యాలీలో వికారాబాద్ మున్సిపల్ చైర్ పర్సన్ చిగుళ్లపల్లి మంజుల రమేష్పాల్గొని.. స్వచ్ఛదనం పచ్చదనంపై అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో వికారాబాద్ మున్సిపల్ మాజీ వైస్ చైర్మన్ చిగుళ్లపల్లి రమేష్ కుమార్, స్థానిక నాయకులు, శానిటేషన్ ఇంచార్జ్ ఎస్ఐ యేసు, మున్సిపల్ సిబ్బంది రామకృష్ణ, వినోద్, మహిపాల్, ఎన్విరాన్మెంటల్ ఇంజనీర్ శ్రీనివాస్, నారాయణ స్కూల్ విద్యార్థులు, కాలనీ వాసులు పాల్గొన్నారు.

# పేదల ఆకలి తీర్చేందుకు ఆగస్టు 15 నుండి రాష్ట్రవ్యాప్తంగా సిద్ధమవుతున్న అన్న క్యాంటీన్లులిజగ్గంపేట అన్న క్యాంటీన్ లో పేదలకు అన్నదానం నిర్వహించిన ఎమ్మెల్యే జ్యోతుల నెహ్రూ



కాకినాడ జిల్లా, జగ్గంపేట , ఆగస్టు 05 జనం రిపోర్టర్ : స్థానిక కాకినాడ రోడ్ లో గల ఎన్టీఆర్ కాంస్య విగ్రహం వద్ద ప్రతి సోమవారం తెలుగుదేశం పార్టీ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న అన్నా క్యాంటీన్ కు ఈ వారం ఆర్థిక సహాయం అందించిన స్వర్గీయ అడపా గృహలక్ష్మి జ్ఞాపకార్థం. భర్త అడపా వెంకట్రావు, కుమార్తెలు భావన, కృష్ణప్రియ ఆర్థిక సాయంతో... ఏర్పాటు చేసిన అన్న క్యాంటీన్ ను ప్రారంభించి పేదలకు అన్నం వడ్డించిన ఎమ్మెల్యే జ్యోతుల నెహ్రూ ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గత ప్రభుత్వం పేదల నోటి కాడ అన్నం లాగి అన్న క్యాంటీన్లు రద్దు చేసినందుకు నిరసనగా జగ్గంపేటలో గత సంవత్సరం ఏడు మాసాలుగా అన్నా క్యాంటీన్ నిర్వహించడం జరుగుతుందన్నారు. పేదల ఆకలిని తీర్చేందుకు ఈ ప్రభుత్వం ఆగస్టు 15 నుండి రాష్ట్రవ్యాప్తంగా అన్నా క్యాంటీన్ ఏర్పాటుకు ప్రభుత్వం ఏర్పాట్లు చేస్తుందని జగ్గంపేటలో అన్నా క్యాంటీన్ ఏర్పాటు చేసే వరకు దాతల సహకారంతో ఈ అన్నా క్యాంటీన్ కొనసాగుతుందని అన్నారు. ఈ కార్యక్రమంలో ఎస్వీఎస్ అప్పలరాజు, మారిశెట్టి భద్రం, జీను మణిబాబు, కొత్త కొండబాబు, ఎం కస్తూరి రంగ, గౌతు నారాయణరావు,రాయి సాయి, దాపర్తి సీతారామయ్య, బచ్చల సుధీర్, వేములకొండ జోగారావు, దేగల సత్తిబాబు, ఎండి కాజా, కురుమల్ల నాగేశ్వరరావు, బద్ది సురేష్, యల్లమిల్లి సీఎం, కోడూరి రమేష్, నాండ్ల చిరంజీవి, అల్లు అంజిబాబు, పాలిశెట్టి సతీష్, ప్రేమ స్వరూప్ బుజ్జి, దార్ల నానాజీ, పాల్గొన్నారు,

# కలెక్టర్ల సదస్సులో ఎన్టీఆర్ జిల్లా కలెక్టర్ డా. జి.సృజన.



ఎన్టీఆర్ జిల్లా, విజయవాడ, ఆగస్టు 05 జనం రిపోర్టర్ : ఆంధ్ర ప్రదేశ్ రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు సోమవారం వెలగపూడి సచివాలయం 5వ బ్లాక్, రెండో అంతస్తులో కలెక్టర్ల సదస్సు నిర్వహించారు. ఈ సదస్సుకు ఎన్టీఆర్ జిల్లా కలెక్టర్ డా. జి.సృజన హాజరయ్యారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత నిర్వహించిన తొలి కలెక్టర్ల సదస్సులో పాలనలో బాధ్యత, జవాబుదారీతనంపై ముఖ్యమంత్రి మార్గనిర్దేశనం చేశారు. అదే విధంగా ప్రజా సంక్షేమం, అభివృద్ధి లక్ష్యంగా రాష్ట్ర ప్రభుత్వం అమలుచేస్తున్న పథకాలను విజయవంతంగా అమలుచేయడంపై సూచనలు చేశారు. 100 రోజుల ప్రణాళిక, "పేదల సేవలో" కార్యక్రమం, జీరో పావర్టీ, ఈజ్ ఆఫ్ పబ్లిక్ సర్వీసెస్ తదితరాలపై ముఖ్యమంత్రి, కలెక్టర్లకు దిశానిర్దేశనం చేశారు. అదే విధంగా రాష్ట్ర ప్రగతికి సమష్టిగా పనిచేద్దామంటూ రాష్ట్ర ఉపముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ సదస్సులో పేర్కొన్నారు.

# ప్రజల మౌలిక అవసరాలు తీర్చడమే టిడిపి ప్రభుత్వ లక్ష్యం జ్యోతుల నెహ్రూ

## ఏలేశ్వరం నుండి రింగ్ రోడ్డు మీదుగా వయా ఇర్రిపాక, నరేంద్ర పట్నం జగ్గంపేట కాకినాడ వరకు సర్వీసులు ఆర్టీసీ సర్వీస్ ప్రారంభం



కాకినాడ జిల్లా, కిర్లంపూడి,ఆగస్టు 05 జనం రిపోర్టర్ : ప్రజల మౌలిక అవసరాలు తీర్చడమే కుటమి ప్రభుత్వ లక్ష్యమని ఎమ్మెల్యే ఎమ్మెల్యే జ్యోతుల నెహ్రూ అన్నారు. ఏలేశ్వరం నుండి వయా నరేంద్ర పట్నం మీదుగా జగ్గంపేట కాకినాడ వరకు రింగ్ రోడ్డుకు ఆర్టీసీ బస్ సర్వీస్ ప్రారంభించారు. ముందుగా కిర్లంపూడి మండలం సోమవరం గ్రామ వెంకటేశ్వర స్వామి ఆలయం వద్ద ప్రత్యేక పూజలు నిర్వహించి ఆకుపచ్చ జెండా ఊపి బస్సు సర్వీస్ ప్రారంభించిన ఎమ్మెల్యే జ్యోతుల నెహ్రూ. అనంతరం బస్సులో కొద్ది దూరం ప్రయాణించారు. రింగ్ రోడ్ లోగల గ్రామాలలో బస్సుకు థాంక్యూ సీఎం సార్, థాంక్యూ ఉప ముఖ్యమంత్రి సార్, థాంక్యూ ఎమ్మెల్యే సార్ అంటూ ప్లకార్డ్లతో స్వాగతం పలికిన నాయకులు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రతి సామాన్యుడికి ట్రాన్స్ పోర్టు అందుబాటులోకి తేవాలన్న ఆలోచనతో గత తెలుగుదేశం ప్రభుత్వంలో గ్రామీణ ప్రాంతాలకు బస్సు సౌకర్యం కల్పించడం జరిగిందని ఇదే బస్సు ఈ రూట్ లో తిరిగే పరిస్థితి ఉండేదని కానీ గత



ప్రభుత్వం ఈ బస్సులన్నిటిని రద్దు చేయడంతో సామాన్యులు ప్రయాణాలకు ఇబ్బంది గురవుతున్నారని ఉద్దేశంతో మళ్లీ సర్వీస్ పునర్దించామని ఆర్టీసీ అంటే లాభనష్టాలకు చూసుకోకుండా సామాన్యులకు అందుబాటులోకి తేవాలని తెలుగుదేశం ప్రభుత్వం వచ్చిన తర్వాత ఏలేశ్వరం నుంచి మొదలుకుని వయా యర్రవరం, నరేంద్ర పట్నం, జగ్గంపేట మీదుగా కాకినాడ వరకు సర్వీస్ నడుస్తుందని అన్నారు. జనం బస్సులు ఎక్కే పరిస్థితిని బట్టి ఎన్ని బస్సులు అయినా వేయడానికి సిద్ధంగా ఉన్నామని ఎమ్మెల్యే నెహ్రూ అన్నారు. ఈ కార్యక్రమంలో ఏలేశ్వరం బస్ డిపో మేనేజర్ సత్యనారాయణ, కిర్లంపూడి ఎంపీపీ తోట రవి, తోట గాంధీ, చదరం చంటిబాబు, బుర్రి సత్తిబాబు, జంపన వెంకట సీతారామచంద్ర వర్మ, పాఠం శెట్టి మురళీకృష్ణ, మంచి కంటి శ్రీను, గంగిరెడ్ల దొరబాబు, బోదిరెడ్ల సుబ్బారావు ,సూతి శ్రీను, కంచి మణి బాబు, వేగి రామకృష్ణ, పెంటకోట సత్యనారాయణ, పేపకాయల బుజ్జి, కె. వీర్రాజు, కంచి కృష్ణ, రింగ్ రోడ్డు గ్రామాల నాయకులు పాల్గొన్నారు.

## ఎన్ టి రాజాపురం బురద కుంట రోడ్లను పరిశీలించిన జగ్గంపేట నియోజకవర్గం జనసేన పార్టీ ఇంచార్జ్ తుమ్మలపల్లి రమేష్.



కాకినాడ జిల్లా, గండేపల్లి,ఆగస్టు 05 జనం రిపోర్టర్ :జగ్గంపేట నియోజకవర్గం జనసేన పార్టీ ఇంచార్జ్ తుమ్మలపల్లి రమేష్ గండేపల్లి మండలం మల్లేపల్లి గ్రామంలో హైవే నా అనుకొని ఎన్టి రాజాపురం వెళ్లే రోడ్డు పూర్తిగా ధ్వంసం అయినందున ఆ గ్రామస్తుల పిలుపుమేరకు మల్లేపల్లి గ్రామంలో ఉన్నటువంటి రోడ్డును సందర్శించి ఎమ్మెల్యే దృష్టికి అలానే ఎంపీ దృష్టికి తీసుకువెళ్లి తొందర్లోనే కొత్త రోడ్డు శాంక్షన్ అయ్యేలా చేస్తానని రమేష్ చెప్పడం జరిగింది. ఈ కార్యక్రమంలో గండేపల్లి మండల ప్రధాన కార్యదర్శి సింగలూరి రామ్ దీపు పితాని వీరబాబు భత్తులు రమణ రామమూర్తి నరసింహ హరీష్ బలిరెడ్డి గణేష్ తదితరులు పాల్గొనడం జరిగింది.

# తాండూరు నియోజకవర్గం తాండూర్ మార్కెట్ కమిటీ ప్రమాణస్వీకారం మరియు పలు అభివృద్ధి పనుల శంకుస్థాపన కార్యక్రమాలలో శాసనసభాపతి, రాష్ట్ర మంత్రులు, ఎమ్మెల్యేల పర్యటన..!!

వికారాబాద్ జిల్లా ఆగస్టు 5 తాండూర్ ఆగస్టు 05 జనం రిపోర్టర్ : తాండూర్ మండలం తాండూర్





నియోజకవర్గం తాండూర్ మార్కెట్ కమిటీ చైర్మన్ మరియు పాలకవర్గం ప్రమాణ స్వీకారం మరియు పలు అభివృద్ధి పనుల శంకుస్థాపన కార్యక్రమలలో స్పీకర్ గడ్డం ప్రసాద్ కుమార్ మంత్రులు కోమటి రెడ్డి వెంకట్ రెడ్డి , పొంగులేటి శ్రీనివాసరెడ్డి , స్థానిక ఎమ్మెల్యే బుయ్యని మనోహర్ రెడ్డి , చేవెళ్ల ఎమ్మెల్యే కాలే యాదయ్య, ఆర్య వైశ్య చైర్ పర్సన్ కల్వ సుజాత , జిల్లా కలెక్టర్ ప్రతీక్ జైన్ మరియు మాజీ ఎంపీ రంజిత్ రెడ్డి తో కలిసి కార్యక్రమాలను నిర్వహించారు.

# పాకెట్ మనీతో చిన్నారి సహస్ర ఆర్థిక సహాయం....

## సామాజిక స్వచ్ఛంద సంస్థ ఫౌండర్ అండ్ చైర్మన్ సురభి శ్రీధర్....



రామగుండం ఆగస్టు 05 జనం రిపోర్టర్ : చదువుల తల్లి కునారపు సిరి, కిడ్నీ వ్యాధితో బాధపడుతూ వైద్యం చేపించుకునే స్తోమత లేక ఆర్థిక ఇబ్బందులు ఎదుర్కొంటున్న సిరికి. వైద్య ఖర్చులకోసం సహస్ర (మిల్కీ) తన పుట్టినరోజు సందర్భంగా తన పాకెట్ మనీ 1000 రూలను వెలుగు సామాజిక స్వచ్ఛ సంస్థ ఆధ్వర్యంలో అందించింది. అనంతరం వెలుగు సామాజిక స్వచ్ఛంద సంస్థ ఫౌండర్ అండ్ చైర్మన్, లయన్స్ క్లబ్ ఆఫ్ హైదరాబాద్ స్ఫూర్తి లయన్, డాక్టర్ సురభి శ్రీధర్ మాట్లాడుతూ. ఎన్టిపిసి జంగాలపల్లి ప్రాంతానికి చెందిన కునారపు పోచం తన కుమార్తె కునారపు సిరి ఇంటర్ సీఈసి లో 1000 కి 927 మార్కులు సాధించి, కళాశాల టాపర్ గా పేరు తెచ్చుకుంది. ఇలాంటి చదువుల తల్లికి 12 ఏళ్ల వయసులోనే ఆటో ఇమ్యూన్ వ్యాధికి గురై రెండు కిడ్నీలు కోల్పోవడం జరిగింది. తండ్రి సెంట్రింగ్ పని చేస్తూ వచ్చిన డబ్బులతో తన కూతురుకు వైద్యం చేపిస్తున్నాపుటికి వైద్యానికి డబ్బులు సరిపోక, పలువురు దగ్గర అప్పులు కూడా చేయడం జరిగిందని. సిరికి ఒక కిడ్నీ అందుబాటులో ఉన్నప్పటికీ, ఆ కిడ్నీ పెట్టడానికి సుమారుగా 15 నుండి 20 లక్షలు ఖర్చు అవుతుందని ,వైద్యులు తెలపడం జరిగిందని తెలిపారు సిరి ఆరోగ్య పరిస్థితి తెలుసుకుని. తన మేనకోడలైన సహస్ర తన పుట్టినరోజు పురస్కరించుకొని, ఆర్థిక సహాయం అందించడం జరిగిందని తెలిపారు. దాతలు ఎవరైనా ఉంటే సిరికి ఆర్థిక సహాయం అందించాలని ఆర్థిక సాయం అందించేవారు.సిరి తల్లిదండ్రులై న వారి ఈ నంబర్లను 9398557486,8977479397 సంప్రదించగలరని.సురభి శ్రీధర్ దాతలను కోరారు.ఈ కార్యక్రమంలో సంస్థ ఆర్గనైజర్ జక్కం శ్రీకాంత్ తదితరులు పాల్గొన్నారు.

## పశ్చిమాసియాలో యుద్ధమేఘాలు.. ఫైటర్‌జెట్లతో అమెరికా రెడీ



వాషింగ్టన్: ఇజ్రాయెల్ హమాస్ యుద్ధం , మధ్యలో హెజ్‌బొల్లా, ఇరాన్ జోక్యంతో పశ్చిమాసియాలో మళ్లీ యుద్ధ మేఘాలు కమ్ముకున్నాయి. హమాస్ చీఫ్ హనియా హత్యకు ప్రతీకారంగా ఇరాన్ , దాని మిత్రదేశాలు ఇజ్రాయెల్ పై ఏ క్షణమైనా దాడి చేసే ముప్పు పొంచి ఉంది. దీంతో ఐడీఎఫ్ అప్రమత్తమైంది. మరోవైపు, టెల్ అవీవ్‌కు అండగా ఉండేందుకు అమెరికా రంగంలోకి దిగింది. పశ్చిమాసియాకు యుద్ధ నౌకలు, ఫైటర్ జెట్లను పంపిస్తోంది. అమెరికా సిబ్బందితో పాటు ఇజ్రాయెల్ రక్షణ కోసం అదనపు యుద్ధ నౌకలు, ఫైటర్ జెట్లను అగ్రరాజ్యం పంపించినట్లు అంతర్జాతీయ మీడియా కథనాలు వెల్లడించాయి. వీటితో పాటు బాలిస్టిక్ క్షిపణి సామర్థ్యం కలిగిన అదనపు క్రూజర్లు, డిస్ట్రాయర్లను కూడా పంపించేందుకు పెంటగాన్ సన్నాహాలు చేస్తున్నట్లు సంబంధిత అధికారులు వెల్లడించారు.

ఇజ్రాయెల్‌లో అప్రమత్తంగా ఉండండి - భారత ఎంబసీ అడ్వైజరీ

హమాస్ అగ్రనేత ఇస్మాయిల్ హనియా గత మంగళవారం ఇరాన్‌లో హత్యకు గురైన సంగతి తెలిసిందే. మరోవైపు హమాస్ సైనిక విభాగాధిపతి మహమ్మద్ డెయిఫ్‌ను హతమార్చినట్లు ఇజ్రాయెల్ ప్రకటించింది. ఇక, లెబనాన్‌లోని హెజ్‌బొల్లా సీనియర్ మిలిటరీ కమాండర్ ఫాద్ షుక్ర్ ఇజ్రాయెల్ జరిపిన దాడిలో మృతిచెందాడు. ఈ వరుస పరిణామాలతో పశ్చిమాసియాలో మళ్లీ ఉద్రిక్తతలు తీవ్రమయ్యాయి. ఇప్పటికే ఇజ్రాయెల్ భూభాగం దిశగా లెబనాన్ పలు రాకెట్లను ప్రయోగించింది. మరోవైపు, హనియా హత్యకు ప్రతీకారంగా ఇజ్రాయెల్‌పై ప్రత్యక్ష దాడికి ఇరాన్ అగ్రనేత అయతుల్లా అలీ ఖమేనీ ఆదేశాలు జారీ చేసినట్లు సమాచారం. టెహ్రాన్‌తో పాటు తమ మిత్ర దేశాలన్నీ నలువైపుల నుంచి ఇజ్రాయెల్‌పై విరుచుకుపడాలని గత బుధవారం జరిగిన సమావేశంలో ఇరాన్ నిర్ణయించినట్లు తెలుస్తోంది. ఈ పరిణామాల నేపథ్యంలో అమెరికా అధ్యక్షుడు జో బైడెన్.. ఇజ్రాయెల్ ప్రధాని నెతన్యాహుతో మాట్లాడారు. దాడులు జరిగితే అండగా ఉంటామని భరోసానిచ్చారు. ఈ ఏడాది ఏప్రిల్‌లో ఇజ్రాయెల్‌పై ఇరాన్ క్షిపణులు, డ్రోన్లతో దాడి చేసిన సంగతి తెలిసిందే. ఆ సమయంలో అమెరికా దళాలు ఇజ్రాయెల్‌కు రక్షణగా నిలిచాయి.

## రాహుల్ జీ.. అశోక్ నగర్‌కు మళ్లీ రండి..



హైదరాబాద్ : కాంగ్రెస్ అగ్రనేత రాహుల్ గాంధీ తెలంగాణ అసెంబ్లీ ఎన్నికల ముందు హైదరాబాద్ అశోక్ నగర్‌లో నిరుద్యోగ యువకులను కలిసిన విషయం తెలిసిందే. ఎన్నికల ప్రచారం సందర్భంగా కాంగ్రెస్ అగ్రనేత చేసిన ఓ ట్వీట్‌ను రీ ట్వీట్ చేస్తూ మాజీ మంత్రి కేటీఆర్ కాంగ్రెస్‌పై ఫైర్ అయ్యారు. హలో రాహుల్ గాంధీ జీ, తెలంగాణ యువత మీరు చెప్పిన ఏడాదికి 2 లక్షల ఉద్యోగాల హామీని నమ్మి కాంగ్రెస్ పార్టీకి ఓటు వేశారన్నారు. అయితే 8 నెలల తర్వాత కాంగ్రెస్ విడుదల చేసిన 'జాబ్ లెస్ క్యాలెండర్, జీరో ఉద్యోగాల కారణంగా యువత ఆందోళన బాట పట్టారని తెలిపారు. మీరు ఎందుకు మళ్లీ హైదరాబాద్‌లోని అశోక్ నగర్‌కు వచ్చి అదే యువతను కలిసి మీరిచ్చిన హామీలను ఎలా నెరవేరుస్తారో చెప్పొచ్చు కదా అని సూచించారు. రాహుల్ చేసిన ట్వీట్‌లో 'తెలంగాణ యువత దొరల కేసీఆర్ పాలనలో తీవ్ర ఇబ్బందులు పడుతోందని.. తన అశోక్ నగర్ పర్యటన తర్వాత ఈ విషయం స్పష్టమైంకి రాగానేదన్నారు. కాంగ్రెస్ అధికారంలో జాబ్ క్యాలెండర్ విడుదల చేసి వారి సమస్యను పరిష్కరిస్తామని రాహుల్ హామీ ఇచ్చారు. దీంతో పాటు ఏడాదికి 2లక్షల ఉద్యోగాలు, టీపీఎస్సీని యూపీఎస్సీలా పునరుద్ధరిస్తామని తెలిపారు. యువ వికాసం పథకం కింద 5 లక్షల ఆర్థిక సాయం అందిస్తామన్నారు. యువత ప్రజాపాలన సాగించే కాంగ్రెస్‌కు మద్దతుగా నిలవాలని ఇదే నా గ్యారంటీ అని ట్వీట్ చేశారు. ఈ ట్వీట్‌ను ప్రస్తావిస్తూ కేటీఆర్ తాజాగా ఘాటుగా స్పందించారు.

## పొరుగు దేశాలతో సంబంధాల నిర్వహణ భారత్‌కు అంత 'సులభం కాదు': జైశంకర్



ఢిల్లీ: పొరుగు దేశాలతో భారత్ తన సంబంధాలను నిర్వహించడమనేది చాలా క్లిష్టమైన వ్యవహారమని దేశ విదేశాంగ శాఖ మంత్రి ఎస్ జైశంకర్ శుక్రవారం ఓ ప్రకటనలో తెలిపారు. అందుకు చారిత్రాత్మక సందర్భాలు, దేశాల పరిమాణం, సామాజిక వ్యత్యాసాలు కారణమని ఆయన అభిప్రాయపడ్డారు. 'మన చరిత్రను బట్టి, పొరుగువారి పరిమాణాన్ని బట్టి, మనదేశ-పొరుగుదేశాల సామాజిక అంశాల కారణంగా సంబంధాలను కలిగి ఉండటం అంత సులభమైన విషయం కాదని గుర్తించామని' తెలిపారు. 'పొరుగు దేశాల్లో రాజకీయంగా ఎత్తుపల్లాలు సర్వసాధారణం. భారత్ గురించి మనోభాగాలను రెచ్చగొట్టడం సులభమైన మార్గం. ఈ వాస్తవాలను అంగీకరించాలి. అయితే, భారత్‌కు ఎక్కువ వనరులు, సామర్థ్యం ఉండటం సానుకూలం అంశం. భౌగోళికంగా మధ్యలో ఉన్నామని' జైశంకర్ వెల్లడించారు. భారత్‌లో పవర్‌గ్రిడ్‌లు, పవర్ ప్లాంట్లు ఉన్నాయి. విద్యుత్ ఎగుమతులు-దిగుమతులను నిర్వహిస్తున్నాం. భారత్‌లో ఇంధన పైప్‌లైన్‌లు, రోడ్లు, రైలు, జలమార్గాల కనెక్షన్లు ఉన్నాయి. రాజకీయ వైరుధ్యాలకు విరుద్ధంగా సంబంధాలను కొనసాగించేందుకు ప్రయత్నించాం. కొన్ని పొరుగు దేశాల్లో భారత్ ఒక రాజకీయ సమస్యగా మారిన సందర్భాలు ఉన్నాయి. అయితే, సమర్థవంతమైన చర్యల ద్వారా తీవ్రమైన పరిస్థితులను విజయవంతంగా ఎదుర్కొంటున్నామని జైశంకర్ వివరించారు.?

## డిపాజిట్ ఖాతాకు నలుగురు నామినీలు.. కేంద్రం కీలక నిర్ణయం

ఢిల్లీ : క్లెయిమ్ చేయని డిపాజిట్లను పరిష్కరించేందుకు కేంద్ర ప్రభుత్వం కొత్త నిర్ణయం తీసుకుంది. ప్రతి డిపాజిట్ ఖాతాకు నలుగురు నామినీలను పెట్టుకునేందుకు అనుమతించింది. దీనికి సంబంధించిన ప్రతిపాదనలను కేంద్ర మంత్రివర్గం ఆమోదించింది. ఈ నిర్ణయం ద్వారా ఖాతాదారుడు మరణించిన తరువాత నామినీగా ఉన్న జాయింట్ ఖాతాదారులు లేదా వారసులకు ఆ డబ్బులను అందించడానికి వీలవుతుంది. అలాగే, వినియోగదారుల సౌలభ్యాన్ని మెరుగుపరచడానికి ఉద్దేశించిన బ్యాంకింగ్ చట్టాలకు సంబంధించిన అనేక సవరణలను కూడా కేంద్రం ఆమోదించింది. ప్రస్తుతం బ్యాంకుల్లో సేవింగ్స్, ఫిక్స్‌డ్ డిపాజిట్ల కోసం ఒకరిని మాత్రమే నామినీగా పెట్టుకోవడానికి అవకాశం ఉంది. వీటిని పెంచాలని చాలా కాలంగా ప్రభుత్వానికి వినతులు వస్తుండగా, తాజాగా ఇప్పుడు కేంద్రం శుభవార్త చెప్పింది. దీని వలన క్లెయిమ్ చేయని డిపాజిట్ల సంఖ్య తగ్గే అవకాశం ఉంది. ప్రస్తుతానికి కేంద్ర ప్రభుత్వం నిర్వహించే పబ్లిక్ ప్రావిడెంట్ ఫండ్‌లో ఎక్కువ మంది నామినీలను పెట్టుకోడానికి వీలుంది. ఆర్థిక కొత్త నిర్ణయంతో బీమా వంటి వాటిలో కూడా మార్పులు రానుమంత్రి నిర్మలా సీతారామన్ పార్లమెంట్‌లో ఈ బిల్లును ప్రవేశపెట్టే అవకాశం ఉంది. గత కొంత కాలంగా బ్యాంకులు, మ్యూచువల్ ఫండ్‌లు, ఇతర డిపాజిట్లలో క్లెయిమ్ చేయని అమౌంట్ భారీగా పేరుకుపోతుంది. డిపాజిట్లు చేసిన వారి వారసులు ఎవరూ రాకపోవడంతో క్లెయిమ్ చేయని డిపాజిట్లు ఎక్కువగా నమోదవుతున్నాయి. మార్చి, 2024 చివరి నాటికి క్లెయిమ్ చేయని డిపాజిట్లు రూ. 78,000 కోట్లకు పెరిగాయి.

# అంధమైన వెలుగు

### మెదడులో అమర్చే ఇంప్లాంట్స్ సహాయంతో దృష్టిజ్ఞానం

### సమీప భవిష్యత్తులో సుసాధ్యం చేసేందుకు యత్నం

### కొన్ని టెక్నాలజీ ల్యాబ్స్, కొన్ని కంపెనీల సంయుక్త కృషి



చికాగో వేదికగా అంధులకు చూపు తెప్పించేందుకు ఇలినాయి ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ నిర్వహిస్తున్న తొలి ప్రయోగాలు బ్రియాన్ బసార్డ్ అనే వ్యక్తిపై జరుగుతున్నాయి. పదహారో ఏట అతడి ఎడమకన్ను పోయింది. ఎలాగోలా నెట్టుకొస్తుండగా 48వ ఏట అతడి రెండో కన్నూ దృష్టిజ్ఞానాన్ని కోల్పోయింది. వైర్డ్ మ్యాగజైన్ కథనం ప్రకారం… ఇలాంటి అంధుల మెదడులో అమర్చే కొన్ని చిప్స్, బయట ఉండే వైర్‌లెస్ ఉపకరణం సహాయంతో చూపు తెప్పించేందుకు ప్రయత్నిస్తున్నారు. కేవలం చికాగో ట్రయల్ మాత్రమే కాకుండా ప్రపంచవ్యాప్తంగా ఇలాంటివి ఎన్నో పరిశోధనలు కొనసాగుతున్నాయి. ఉదాహరణకు స్పెయిన్‌లోని మిగ్యుయెల్ హెర్నాండెజ్ యూనివర్సిటీ పరిశోధకులూ ఇలాంటి ప్రయోగాలే చేస్తున్నారు. కాలిఫోర్నియాలోని కార్టిజెంట్ అనే సంస్థ 'ఓరియాన్' అనే ఉపకరణాన్ని రూపొందించి, ఆరుగురు వలంటీర్లకు ప్రయోగాత్మకంగా అమర్చింది. ఎలాన్ మస్క్ ఆధ్వర్యంలోని 'న్యూరాలింక్' సంస్థ కూడా అంధులకు దృష్టిజ్ఞానం తెప్పించే దిశగా పనిచేస్తోంది. ఇందుకోసం బ్రెయిన్ ఇం?ంట్స్ రూపొందించి ప్రయోగాలు చేస్తోంది. వాళ్ల దగ్గర తయారవుతున్న ఇంపాంట్‌కు 'బ్లైండ్‌సైట్' అని పేరు పెట్టారు. కోతులకు అమర్చిన ఈ 'బ్లైండ్‌సైట్'తో మంచి ఫలితాలే వచ్చాయనీ, ఇకపైన దాన్ని మానవులపై ప్రయోగించి చూడాల్సిందే మిగిలి ఉందని 'న్యూరాలింక్స్' పేర్కొంది. అయితే చూడటం అనేది చాలా సంక్లిష్టమైన ప్రక్రియ కావడంతో ప్రస్తుతానికి ఈ ప్రయోగాలపట్ల చాలామంది నిపుణుల నుంచి సందేహాత్మకమైన అభిప్రాయాలే ఎక్కువగా వినిపిస్తున్నాయి. గతంలో దృష్టిజ్ఞానం ఉండి తర్వాత చూపు కోల్పోయిన వారికే ఈ ఇం?ంట్స్ అమర్చుతున్నారు. అయితే ఈ బ్లైండ్‌సైట్ ఉపకరణం కేవలం గతంలో చూపున్న వారికి మాత్రమే కాకుండా పుట్టు అంధులకూ దృష్టిజ్ఞానం కలిగించగలదన్నది ఎలాన్ మస్క్ చెబుతున్న మాట. ఇప్పుడు ప్రయోగాత్మకంగా తయారవుతున్న ఉపకరణాలన్నీ రెటీనా, ఆప్టిక్ నర్వ్ ప్రమేయం లేకుండానే నేరుగా మెదడుకు దృష్టిజ్ఞానం కలిగించేలా రూపొందుతున్నాయి. మెదడులో అమరుస్తున్న చిప్స్… కొన్ని విద్యుత్తరంగాలతో అక్కడి న్యూరాన్లను ఉత్తేజితం (స్టిమ్యులేట్) చేయడం… ఫలితంగా మెదడులోని విజువల్ కార్టెక్స్‌లో చూస్తున్న దృశ్యం ఒక చుక్కల ఇమేజ్‌లా కనిపిస్తుంది. (విజువల్ కార్టెక్స్ అంటే… రెటీనా నుంచి ఆప్టిక్ నర్వ్ ద్వారా కాంతి మెదడుకు చేరాక దృష్టిజ్ఞానం కలిగించేందుకు మెదడులోప్రాంసెసింగ్ జరిగే మెదడులోని ప్రాంతం.అయితే ఇప్పుడిది ఎలక్ట్రానిక్ ఉపకరణాలతో జరుగుతున్న ప్రక్రియ కావడంతో ఇందులో వాస్తవ కాంతి ప్రమేయం లేకుండానే ఇదంతా జరిగి?తుంది. వీటి సాయంతో కనిపిస్తుందనే ఆ ఇమేజ్ కూడా అస్పష్టమైనది. ఆ డివైజ్ కారణంగా కనిపించే అస్పష్ట దృశ్యాలూ, దృష్టిజ్ఞానపు పరిమితులూ వంటి అంశాలను దృష్టిలో పెట్టుకుని ఈ ప్రయోగం జరుగుతున్నవారికి ప్రతిరోజూ కొన్ని సూచనలివ్వడం జరుగుతోంది. ఉదాహరణకు వారు గుర్తిస్తున్నదేమిటీ, ఒకవైపు వెళ్లమన్న తర్వాత వారు ఆ దిశగా వెళ్తున్నప్పుడు వారికి ఎదురవుతున్న ప్రతిబంధకాలేమిటన్న అంశాలను బట్టి… డివైస్‌లను మరింత మెరుగుపరిచేందుకు రోజూ ప్రయోగాలు జరుగుతున్నాయి. దృష్టిజ్ఞానాన్ని మరింతగా మెరుగుపరిచే దిశగా వారికి ఎదురవుతున్న సవాళ్లలో మరో అంశం ఏమిటంటే… ఒక పక్క దృష్టిజ్ఞానం కల్పిస్తూనే, ఈ స్టిమ్యులేషన్స్ వల్ల వారికి వేరే అనర్థాలు రాకుండా బ్యాలెన్స్ చేసుకోవాలి. ఉదాహరణకు… ఈ ఎలక్ట్రిక్ స్పందనలు మెదడులోని ప్రదేశాలకు తాకినప్పుడు అవి సీజర్స్, మూర్ఛ వంటివి వచ్చేలా మెదడును ప్రేరేపించకూడదు. కంటిన్యూవస్‌గా ఎలక్ట్రిక్ తరంగాలకు గురవుతున్నందు వల్ల మెదడులో స్కార్ ఏర్పడే అవకాశముందా, అప్పుడు మెదడుకు హానిచేయని విధంగా ఈ ఉపకరణాల రూపకల్పన ఎలా అన్న సవాలు కూడా మరో ప్రతిబంధకం. ప్రస్తుతానికి ఇలాంటి పరిమితులు కనిపిస్తున్నప్పటికీ దీర్ఘకాలంలో చూపులేనివారికి దృష్టిజ్ఞానం కల్పించగలమనే నమ్మకం పెరుగుతోందన్నది పరిశోధకుల మాట.

ఎలాన్ మస్క్ ట్వీట్

మా 'బ్లైండ్‌సైట్' ఇంప్లాంట్స్ ఇప్పటికే కోతుల్లో బాగా పనిచేస్తోంది. మొదట్లో స్పష్టత (రెజెల్యూషన్) కాస్త తక్కువే. అంటే తొలినాళ్లలో వచ్చిన 'నింటెండో (గ్రాఫిక్స్)' మాదిరిగా. కానీ క్రమంగా మానవుల నార్మల్ దృష్టిజ్ఞానంలాగే ఉంటుంది.

(ఇంకా ఏమిటంటే… ఈ న్యూరాలింక్ వల్ల ఏ కోతీ చనిపోలేదూ, ఇంకేకోతికీ హాని జరగలేదు).

# క్షిపణి దాడి కాదది… బెడ్రూంలో బాంబు

### హనియే హత్య వెనక మతిపోయే ప్లాన్

### రెణ్నెల్ల ముందే అమర్చిన ఇజ్రాయెల్

### గదిలోకి వెళ్తూనే రిమోట్‌తో పేల్చివేత



'జింకను వేటాడేప్పుడు పులి ఓపికగా ఉంటది. అదే పులినే వేటాడాల్సొస్తే?! ఇంకెంత ఓపిక కావాలి?' ఇది ఓ సినిమాలోని డైలాగ్. హమాస్ చీఫ్ ఇస్మాయిల్ హనియేపై దాడి కోసం ఇజ్రాయెల్ నిఘా విభాగం మొసాద్ కూడా అచ్చం అలాగే ఓపిక పట్టింది. అది కూడా ఒక రోజో, రెండ్రోజులో కాదు.. ఏకంగా రెండు నెలలకు పైగా! ఆయన బస చేస్తారని భావించిన ఇంట్లో అప్పటికే బాంబు అమర్చి ఉంచింది. ఏ బెడ్రూంలోకి వెళ్తాడో పక్కాగా తెలుసుకుని మరీ అందులోనే బాంబును సిద్ధం చేసి పెట్టింది. అలా హనియే కోసం ముందస్తుగానే కాచుకుని కూచున్న మృత్యువు, సమయం రాగానే అమాంతంగా మింగేసింది…! ఇరాన్ రాజధాని టెహ్రాన్‌లో గత బుధవారం తెల్లవారుజామున జరిగిన పేలుడులో హనియే మరణించారు. అత్యంత కచ్చితత్వంతో కూడిన ఇజ్రాయెల్ క్షిపణి దాడే అందుకు కారణమని తొలుత వార్తలొచ్చాయి. క్షిపణిలాంటి వస్తువేదో హనియే గది కిటికీని తాకడాన్ని ప్రత్యక్ష సాక్షులు చూశారని కొందరు చెప్పారు. అది క్షిపణి దాడేనని ఇరాన్ కూడా ఆరోపించింది. టెహ్రాన్‌లో కట్టుదిట్టమైన రక్షణలో ఉండే గెస్ట్ హౌస్‌ను హనియేకు కేటాయించారు. అలాంటి గెస్ట్ హౌస్‌పై సుదూరం నుంచి అంతటి కచ్చితత్వంతో క్షిపణి దాడి సాధ్యమేనా? పైగా క్షిపణి దాడితో భారీ విధ్వంసం జరుగుతుంది. కానీ ఆ గెస్ట్ హౌస్‌కు అంతటి నష్టమేమీ జరగలేదు. గది, పరిసర భాగాలే బాగా దెబ్బతిన్నాయి. అదే భవనంలో పాలస్తీనా ఇస్లామిక్ జిహాద్ నాయకుడు జియాద్ అల్ నఖలా బస చేసిన పక్క గది కూడా దెబ్బ తినలేదు. కనుక ఎలా చూసినా జరిగింది క్షిపణి దాడి కాదు.

వామ్మో ఇజ్రాయెల్!

హనియే మృతికి గది లోపలి పేలుడే కారణమని ఇరాన్ అధికారులు ఎట్టకేలకు గుర్తించారు. ఆ గదిలో రెండు నెలల కిందే బాంబు పెట్టారని తెలుస్తోంది. ఇరాన్ భద్రతలోని లోపాలనే అందుకు అనువుగా మార్చుకున్నారు. బాంబు పెట్టి రెండు నెలలపాటు ఓపికగా నిరీక్షించారు. ఇరాన్ కొత్త అధ్యక్షుడు మసూద్ పెజెష్కియాన్ ప్రమాణ స్వీకారంలో పాల్గొనేందుకు హనియే టెహ్రాన్ చేరుకున్నారు. అది ముగిశాక గెస్ట్‌హౌస్‌కు చేరుకుని ఆ గదిలోకే వెళ్లినట్టు పక్కాగా నిర్ధారించుకున్న తర్వాతే రిమోట్‌తో బాంబు పేల్చారు. పేలుడు ధాటికి భవనం ఒక్కసారిగా కదిలిపోయింది. గోడలో కొంత భాగం కూలింది. కిటికీలు పగిలాయి. పేలుడు తీవ్రతకే హనియే మృతి చెందారు. ఈ కోవర్ట్ ఆపరేషన్ వివరాలన్నింటినీ పాశ్చాత్య అధికారులతో మొసాద్ పంచుకుందని న్యూయార్క్ టైమ్స్ వార్తా పత్రిక పేర్కొంది. దేశం వెలుపల రాజకీయ ప్రత్యర్థులు తదితర టార్గెట్ల ఏరివేతకు మొసాద్ పాల్పడుతోంది. ఇజ్రాయెల్‌పై హమాస్ అక్టోబర్ 7 దాడుల తర్వాత దాని అగ్ర నేతలందరినీ వేటాడతామని ప్రధాని నెతన్యాహూతో పాటు మొసాద్ చీఫ్ డేవిడ్ బర్నియా కూడా ప్రతిజ్ఞ చేశారు.

# జగన్ కు చంద్రబాబు గట్టి షాక్.. ఆ ఫైల్స్ సీజ్‌బీ రంగంలోకి సిఐడీ!!



అమరావతి: ఏపీలో పాలనాపగ్గాలు చెప్పటిన చంద్రబాబు ప్రభుత్వం శాఖల వారీగా సమీక్షలు నిర్వహిస్తూ గత ప్రభుత్వ అవినీతిని, వైఫల్యాలను ఎండగడుతుంది. ఇదే సమయంలో ఆయా శాఖల వారీగా ప్రక్షాళన మొదలుపెడుతుంది. ఇక తాజాగా ఎక్సైజ్ శాఖపై సమీక్ష జరిపిన చంద్రబాబు గత ఐదేళ్ళ పాలన జరిపిన జగన్ సర్కార్ ను టార్గెట్ చేశారు. జగన్ పాలన సమయంలో ఎక్సైజ్ శాఖలో జరిగిన అవినీతిపై కీలక నిర్ణయం తీసుకున్నారు.

ఎక్సైజ్ అక్రమాలపై సీఐడీతో దర్యాప్తు

ఎక్సైజ్ శాఖలో గత ప్రభుత్వంలో జరిగిన అక్రమాలపై సీఐడీతో దర్యాప్తు జరిపిస్తామని సీఎం చంద్రబాబు నాయడు మరోసారి స్పష్టం చేశారు. ఇప్పటికే ఏపీలో మద్యం అక్రమాలపై విచారణ జరిపిస్తామని శ్వేత పత్రం విడుదల చేసిన సమయంలో అసెంబ్లీ వేదికగా ప్రకటించిన చంద్రబాబు దీనిపై నిర్ణయం తీసుకున్నకారణంగా గత 5 ఏళ్లలో జరిగిన లావాదేవీలపై అన్ని ఫైళ్లు సీజ్ చేయాలని అధికారులను ఆదేశించారు.

జగన్ పాలనలో మద్యం విధానంతో భారీ అక్రమాలు

త్వరలో ప్రారంభమయ్యే సీఐడీ విచారణకు ఎక్సైజ్ శాఖ అధికారులు పూర్తిగా సహకరించాలని సీఎం చంద్రబాబు ఆదేశించారు. జగన్ పాలనలో ఊహించని స్థాయిలో 5 ఏళ్లలో మద్యంలో అక్రమాలు జరిగాయని దీనిపై అన్ని లావాదేవీలు సీఐడీకి అందించాలన్నారు చంద్రబాబు. గత ప్రభుత్వం మద్య నిషేధం చేస్తామని చెప్పి, చెయ్యకుండా నాసిరకం మద్యం తెచ్చి ప్రజల ప్రాణాలతో చెలగాటం ఆడిందని మండిపడ్డారు.

నాణ్యత లేని మద్యం ఏపీలో ఉండకూడదు

ప్రజల ప్రాణాలు తీసే నాసిరకం మద్యం ఇక రాష్ట్రంలో కనిపించటానికి వీలు లేదని చంద్రబాబు స్పష్టం చేశారు. ఎన్నికల్లో చెప్పినట్లు నాణ్యత లేని మద్యం ఏపీలో లేకుండా చేయాల్సిన అవసరం ఉందన్న సీఎం చంద్రబాబు నాణ్యత విషయంలో రాజీ పడొద్దని, తద్వారా ప్రజల ఆరోగ్యాన్ని కాపాడాలని అన్నారు. మద్యం సేవించేవారితో మాన్పించడం సాధ్యం కాకపోయినప్పటికీ తీవ్ర అనారోగ్యానికి కారణమయ్యే నాణ్యత లేని నాసిరకం మద్యం లేకుండా చేస్తే మంచిదన్నారు.

గతంలో మద్యం విధానం వల్ల పేదల జీవితాలు నాశనం అయ్యాయి

గత ప్రభుత్వం అడ్డగోలుగా రేట్లు పెంచి పేదలను దోచుకుందని పేర్కొన్న సీఎం చంద్రబాబు నాటి మద్యం ధరలు భరించలేక చాలా మంది గంజాయి, కల్తీ మద్యం, నాటుసారా తాగి ఆరోగ్యాన్ని పాడుచేసుకున్నారన్నారు. జగన్ హయాంలో ఇష్టారీతిన పెంచిన ధరలు పేదల జీవితాలను మరింత నాశనం చేశాయని పేర్కొన్న చంద్రబాబు ఆ ధరలను నియంత్రించాల్సిన అవసరం ఉందన్నారు.

పేదవాడిని దోచుకున్న విధానానికి స్వస్తి

పేద కుటుంబాల జీవన ప్రమాణాలు దెబ్బ తినకుండా మద్యం విధానం ఉండాలని చంద్రబాబు అభిప్రాయపడ్డారు. రేట్లు పెంచి పేదవాడిని దోచుకున్న విధానానికి స్వస్తి పలకాల్సిందేనని సీఎం స్పష్టం చేశారు. పొరుగు రాష్ట్రాల మద్యం మన రాష్ట్రంలోకి రాకుండా చూడాలని ఆదేశించారు. గంజాయి విషయంలో కూడా ఉక్కుపాదం మోపాలన్నారు సీఎం చంద్రబాబు . మద్యం విధానం ఆదాయం కోణంలో చూడొద్దని, అవకతవకలకు అవకాశం లేని విధంగా ఉండాలని సీఎం చంద్రబాబు నాయుడు స్పష్టం చేశారు.

EDITOR, PRINTER, PUBLISHER AND OWNED BY SIRASALA SURESH KUMAR, # /639-1-7-15, NANDYAL ROAD, CPI COLONY, 4TH ROAD, TADIPATRI-515 411, Ananthapuramu Dist., (A.P.), PUBLISHED AT # 1/639-1-7-15,NANDYAL ROAD,CPI COLONY, 4TH ROAD,TADIPATRI-515 411,Ananthapuramu Dist.,(A.P.).
Cell:9398156948,REG.RNI:APTEL/2023/86845, E-Mail:janamnews19@gmail.com